ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

సంపుటి - 02 సంచిక -184 పేజీలు - 08 వెల - 04/-

ఆదివారం 27 ఏప్రిల్ 2025

# మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తా

## మత్స్యకారుల సేవలో పథకాన్ని ప్రారంభించిన చంద్రబాబు

### శ్రీకాకుళం జిల్లా బుడగట్లపాలెం గ్రామంలో చంద్రబాబు పర్యటన మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్న వైనం



ఏపీలో మత్స్యకారుల సేవలో పథకాన్ని ప్రారంభించారు. దీనిపై సీఎం చంద్రబాబు ఎక్స్ లో స్పందించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీకి అనుగుణంగా మత్స్యకారులకు వేట విరామ కాలంలో అందించే ఆర్థిక సాయాన్ని పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గతంలో రూ.10 వేలుగా ఉన్న ఈ సహాయాన్ని రూ. 20 వేలకు పెంచామని, ఈ పథకం కింద నేడు 1,29,178 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ. 20 వేల చొప్పున మొత్తం రూ. 258.35 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన వెల్లడించారు.మిగతాది 2లో...



# సరిహద్దుల్లో టెన్షన్..

- దాక్కోవడానికి బంకర్లను సిద్ధం చేసుకుంటున్న ప్రజలు
- పహల్గామ్ ఉగ్రదాడితో భారత్-పాక్ సరిహద్దుల్లో పెరిగిన ఉద్రిక్తత
- బంకర్లను శుభ్రం చేసుకుంటున్న సరిహద్దు ప్రజలు
- పంట కోతలు త్వరగా ముగించి, భద్రతకు ఏర్పాట్లు
- ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ప్రజల విజ్ఞప్తి



పహల్గామ్ ఉగ్రదాడి ఘటన భారత్-పాకిస్థాన్ సరిహద్దు గ్రామాల్లో తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తోంది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మళ్లీ రాజుకోవడంతో, సరిహద్దు ప్రజలు భయాందోళనలతో బిక్కుబిక్కుమంటున్నారు. ఎప్పుడేం జరుగుతుందోనన్న భయంతో తమను తాము రక్షించుకునేందుకు ప్రభుత్వ నిర్మిత బంకర్లలో తలదాచుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. 2021లో ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత కొంతకాలం ప్రశాంతంగా గడిచిందని,మిగతాది 2లో...

## ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో

# సజ్జల శ్రీధర్ రెడ్డి అరెస్టు

- ఏపీ లిక్కర్ స్కాం కేసు దర్యాప్తులో సిట్ దూకుడు
- విజయవాడలో ఏసీబీ కోర్టులో హాజరు
- మే 6 వరకు జ్యుడిషియల్ రిమాండ్ విధించిన న్యాయమూర్తి

ఏపీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టయిన ఎస్‌పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని సజ్జల శ్రీధర్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు మే 6వ తేదీ వరకు రిమాండ్ విధించింది. దీంతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు అతడిని విజయవాడ జిల్లా జైలుకు తరలించనున్నారు. ఈ కేసులో ఆరో నిందితుడిగా (ఏ6) ఉన్న శ్రీధర్‌రెడ్డిని సిట్ అధికారులు మిగతాది 2లో...



## 15వ ఆర్థిక సంఘం

# నిధుల విడుదల

- 1121.20 కోట్ల నిధులు జమ
- 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ

**అమరావతి ఏప్రిల్ 26 ఆంధ్ర ప్రగతి:**

రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో రూ. 1121.20 కోట్ల నిధులు జమ

ఏపీలోని కూటమి ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. ఈ మేరకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో రూ. 1121.20 కోట్ల నిధులు జమయ్యాయి. ఇందులో 70 శాతం గ్రామ పంచాయతీలకు, మండల పరిషత్‌లకు 20 శాతం, జిల్లా పరిషత్‌లకు 10 శాతం చొప్పున నిధులను కేటాయించనున్నారు. జనాభా ప్రాతిపదికన ఆయా గ్రామ పంచాయతీల బ్యాంక్ ఖాతాలకు ఆర్థిక శాఖ అనుమతితో పంచాయతీ రాజ్ శాఖ నిధులను జమ చేయనుంది.

## చంద్రబాబు అప్పుడూ..

# ఇప్పుడూ విలనే

అనవసరంగా హీరోగా చూపిస్తున్నారు

ఏడాది పాలనలో ఒక్క హామీ నెరవేర్చలే

మాజీమంత్రి అంబటి రాంబాంబు విమర్శలు



2లో

# అప్పటిలా కాదు... ఇప్పుడు ప్రతి గ్రామంలో మనం ఉన్నాం

## వైసీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో జగన్ వ్యాఖ్యలు

- గతంలో తనను 16 నెలుల జైల్లో ఉంచారని వెల్లడి
- ప్రజలే అండగా నిలిచారని స్పష్టీకరణ
- ఇప్పుడు కూడా ప్రజలే తీవ్రంగా స్పందిస్తారని ఆశాభావం

**అమరావతి ఏప్రిల్ 26 ఆంధ్ర ప్రగతి:**

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు నమోదు చేసినా, ఇబ్బందులకు గురి చేసినా తాను కానీ, పార్టీ శ్రేణులు కానీ భయపడే ప్రసక్తి లేదని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.మిగతాది 2లో...



# దేశంలో ప్రతిపక్షాన్ని అణచివేసే రాజకీయాలు



- భారత్ సమ్మిట్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- ప్రతిపక్షాన్ని అణచివేసే దూకుడు రాజకీయాలు నడుస్తున్నాయని ఆరోపణ
- కొన్నేళ్ల క్రితం కాంగ్రెస్ పూర్తిగా ఒంటరిగా, చిక్కుకుపోయినట్లు భావించామని వెల్లడి
- భారత్ జోడో యాత్ర ద్వారా పాఠాలు నేర్చుకున్నా
- కోపం, భయం, ద్వేషంపై ప్రత్యర్థుల గుత్తాధిపత్యం ఉందని వ్యాఖ్య

2లో

## కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్..

# 38 మంది నక్సలైట్లు మృతి?

బీజాపూర్ **ఏప్రిల్ 26 (రిపబ్లిక్ న్యూస్)**

%తెలంగాణ-చత్తీస్‌గఢ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లా ధర్మ తాళ్లగుడెం పరిధిలోని కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో 38 మంది మావోయిస్టులు మృతిచెందినట్టు సమాచారం. గతవారం రోజులుగా కర్రెగుట్టలే లక్ష్యంగా భద్రతా దళాలుమిగతాది 2లో...



# సామాజిక న్యాయం పారదర్శక పాలన

- రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్, పంటల బీమా అమలు
- యువతకు నైపుణ్య శిక్షణ, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు
- మహిళా సాధికారతకు ప్రాధాన్యం, కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యం
- విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు అత్యధిక ప్రాధాన్యత
- భారత్ సమ్మిట్ వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



2లో

# అప్పటిలా కాదు... ఇప్పుడు ప్రతి గ్రామంలో మనం ఉన్నాం

(మొదటి పేజి తరువాయి)

గతంలో కాంగ్రెస్ హయాంలో తనను అన్యాయంగా 16 నెలల పాటు జైలులో ఉంచారని, పార్టీని నడపలేని పరిస్థితులు కల్పించినా ప్రజలు తనను, పార్టీని ఆదరించారని ఆయన గుర్తు చేసుకున్నారు.పీఏసీ సమావేశంలో జగన్ మాట్లాడుతూ, "నాడు నన్ను 16 నెలలు జైలులో పెట్టారు. పార్టీని నడిపే పరిస్థితి లేకుండా చేశారు. అయినా ప్రజలు ఆశీర్వదించారు. ఇప్పుడు ప్రతి గ్రామంలో మన పార్టీ ఉంది. వాళ్లు ఎన్ని కేసులు పెడితే ప్రజలు అంత తీవ్రంగా స్పందిస్తారు. నన్ను మరోసారి జైలుకు పంపినంత మాత్రాన ప్రజా వ్యతిరేకతను అణచివేయలేరు" అని అన్నారు. గతంలో అక్రమాస్తుల కేసులో తనను అన్యాయంగా ఇరికించి జైలుకు పంపినా, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి అఖండ విజయాన్ని అందించారని జగన్ గుర్తుచేశారు. అదే విధంగా, ఇప్పుడు కూడా ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని కేసులు బనాయించినా ప్రజల మద్దతు తమకే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు ఎదురైనా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని జగన్ ఈ సమావేశం ద్వారా సంకేతాలు పంపారు. ప్రభుత్వ చర్యల వల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగి, అది అంతిమంగా తమ పార్టీకే లాభిస్తుందని అభిప్రాయపడ్డారు.

# ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో సజ్జల శ్రీధర్ రెడ్డి అరెస్టు

(మొదటి పేజి తరువాయి)

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని విజయవాడకు తరలించి, నేడు ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయమూర్తి, శ్రీధర్‌రెడ్డికి మే 6 వరకు జ్యుడిషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మద్యం కుంభకోణానికి సంబంధించి జరిగిన కుట్రలో శ్రీధర్ రెడ్డి కీలక పాత్ర పోషించినట్లు సిట్ అధికారులు ఆరోపిస్తున్నారు.గత వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారం చేపట్టిన తర్వాత, కొత్త మద్యం విధానం పేరుతో నెలనెలా రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు అక్రమంగా ముడుపులు వసూలు చేసేందుకు కుట్ర జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ కుట్రలో భాగంగా జరిగిన కీలక సమావేశాల్లో శ్రీధర్‌రెడ్డి కూడా పాల్గొన్నారని సిట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సమావేశాల్లో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, నాటి ప్రభుత్వ ఐటీ సలహాదారు రాజ్ కెసిరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, అదే సంస్థ ప్రత్యేకాధికారి సత్యప్రసాద్ వంటి వారు కూడా పాల్గొన్నట్లు కేసు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. ఈ ఆరోపణల నేపథ్యంలోనే సిట్ అధికారులు శ్రీధర్‌రెడ్డిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు.

# సరిహద్దుల్లో టెన్షన్..

(మొదటి పేజి తరువాయి)

అయితే ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడితో పరిస్థితులు మళ్లీ మొదటికి వచ్చాయని స్థానికులు వాపోతున్నారు. గతంలో తరచూ వినిపించే 'కాల్పుల విరమణ' హెచ్చరికలు మళ్లీ మొదలయ్యాయని వారు చెబుతున్నారు.సరిహద్దుల నుంచి ఊహించని విధంగా కాల్పులు లేదా షెల్లింగ్ జరిగితే తలదాచుకునేందుకు వీలుగా, కొన్నేళ్లుగా ప్రభుత్వం నిర్మించిన బంకర్లను శుభ్రపరిచి సిద్ధంగా ఉంచుకుంటున్నారు. "ఉద్రిక్తతల నడుమ బతుకుతున్నాం. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. మమ్మల్ని మేము రక్షించుకోవడానికే ఈ బంకర్లను సిద్ధం చేసుకుంటున్నాం. పహల్గామ్ లాంటి దాడులను సహించబోం. ఉగ్రవాదులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి" అని ఓ గ్రామ మాజీ సర్పంచ్ బల్బీర్ కౌర్ తెలిపారు.ప్రస్తుతం సరిహద్దు ప్రాంతాల్లో గోధుమ పంట కోతలు జరుగుతున్నాయి. పురుషులు పంట పనుల్లో నిమగ్నమవ్వగా, మహిళలు బంకర్లను శుభ్రం చేసి, నివాసయోగ్యంగా మార్చే పనుల్లో నిమగ్నమయ్యారు. "మేం ఆయుధాలు లేని సైనికులం. శత్రువులను ఎదుర్కోవడానికి ఎల్లప్పుడూ సిద్ధమే. ఉగ్రదాడికి పాల్పడిన పాకిస్థాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలి" అని సరిహద్దు వాసులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉగ్రవాదంపై తీసుకునే ఎటువంటి చర్యలకైనా తాము కట్టుబడి ఉంటామని వారు స్పష్టం చేస్తున్నారు.

సరిహద్దు ప్రజల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం 2017లోనే పలు జిల్లాల్లో సుమారు 14,460 బంకర్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. ఆ తర్వాత మరో 4 వేల బంకర్ల ఏర్పాటుకు కూడా నిర్ణయం తీసుకుంది. ఈ బంకర్లే ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల్లో ప్రజలకు రక్షణ కవచాలుగా నిలుస్తున్నాయి.

# కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్..

(మొదటి పేజి తరువాయి)

ఆపరేషన్ కగార్ చేపట్టిన విషయం తెలిసిందే. సుమారు 5,500 మందితో డీఆర్‌జీ బస్తర్ ఫైటర్ కోబ్రా, సీఆర్‌పీఎఫ్, ఎస్‌టీఎఫ్ సైనికులు భారీ కూంబింగ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో ఈరోజు జరిగిన ఎదురు కాల్పుల్లో సుమారు 38 మంది నక్సలైట్లు మృతిచెందినట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య ఇంకా భారీగా పెరిగే అవకాశం ఉందని సమాచారం. కానీ, మావోల మృతిపై ఇప్పటివరకు అధికారులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాగా, కర్రెగుట్టల కూంబింగ్ కొనసాగుతున్న వేళ శుక్రవారం మధ్యాహ్నం బస్తర్ మావోయిస్టుల ఇంచార్జ్ పేరిట లేఖ ఒకటి విడుదలైంది. ఆ లేఖలో ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేయాలని, తాము శాంతి చర్చలకు సిద్ధమని కేంద్రంతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు మావోలు విజ్ఞప్తి చేశారు.

# సామాజిక న్యాయం, పారదర్శక పాలన

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయానికి పెద్దపీట వేసిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధరతో పాటు, వరి క్వింటాల్‌కు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నామని, దీనివల్ల రైతులు లాభాలు ఆర్జిస్తున్నారని చెప్పారు. రైతు బీమాతో పాటు పంటల బీమా ద్వారా కూడా కర్షకులకు భరోసా కల్పిస్తున్నామన్నారు. యువత విద్య, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించామని, నైపుణ్యాలు లేని యువత కోసం 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'ని ప్రారంభించామని తెలిపారు. తాము బాధ్యతలు స్వీకరించిన తొలి ఏడాదిలోనే 60,000 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఐదు లక్షల మంది యువతకు లబ్ధి చేకూరేలా 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రారంభించామని వివరించారు.తెలంగాణ సంస్కృతిలో మహిళలకు సమానత్వం, గౌరవం ఇస్తామని సీఎం ఉద్ఘాటించారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో పురుషులతో సమానంగా మహిళలు పోరాడారని గుర్తుచేశారు. తమ ప్రభుత్వానికి మహిళలు అత్యంత ముఖ్యమని, రాష్ట్రంలో 67 లక్షల మంది సభ్యులతో మహిళా స్వయం సహాయక సంఘాలు బలంగా ఉన్నాయని తెలిపారు. కోటి మంది మహిళలను విజయవంతమైన వ్యాపారవేత్తలుగా, కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని వివరించారు. సౌర విద్యుత్ ప్లాంట్లు, ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకుల యాజమాన్యాన్ని మహిళలకు అప్పగించామని, ప్రీమియం రిటైల్ అవుట్‌లెట్లలో వారికి దుకాణాలు కేటాయించామని చెప్పారు. మహిళల సౌర విద్యుత్ కంపెనీల నుంచి వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు డిస్కంలు ఒప్పందాలు చేసుకున్నాయని, 600 బస్సుల నిర్వహణ బాధ్యత మహిళలకే ఇచ్చామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తొలి ఏడాదిలోనే 4.50 లక్షల కుటుంబాలకు రూ.22,000 కోట్లు అందించామని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం 15 నెలల్లో రూ.5,000 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. గ్యాస్ సిలిండర్‌పై రూ.500 రాయితీ ఇస్తున్నామని కూడా తెలిపారు. దాదాపు వందేళ్ల తర్వాత కుల గణన చేపట్టిన తొలి రాష్ట్రం తెలంగాణ అని సీఎం గర్వంగా ప్రకటించారు. బీసీల సాధికారత తమ ప్రభుత్వ విధానమని, దళితుల చిరకాల డిమాండ్ అయిన ఎస్సీ కోటా వర్గీకరణను అమలు చేశామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో థర్డ్ జెండర్‌ను నియమించిన తొలి ప్రభుత్వం కూడా తమదేనని, వారిని ఇతర శాఖల్లోకి కూడా తీసుకుంటామని చెప్పారు.

# దేశంలో ప్రతిపక్షాన్ని అణచివేసే రాజకీయాలు

## భారత్ సమ్మిట్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ




**ఏప్రిల్ 26 ఆంధ్ర ప్రగతి:** రాజకీయాల్లో తమ ప్రత్యర్థులు కోపం, ద్వేషంపై గుత్తాధిపత్యం కలిగి ఉన్నారని, ఆ విషయాల్లో వారితో తమ పార్టీ పోటీ పడలేకపోతోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, తాను నిన్ననే రావాల్సి ఉన్నా, కశ్మీర్‌కు వెళ్లడం వల్ల రాలేకపోయానని, అందుకు క్షమించాలని కోరారు.

దేశంలో ప్రస్తుతం ప్రతిపక్షాన్ని మాట్లాడనివ్వకుండా, అణచివేసే దూకుడు రాజకీయాలు కొనసాగుతున్నాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కొన్నేళ్ల క్రితం తమ పార్టీ పూర్తిగా ఒంటరిగా, రాజకీయంగా చిక్కుకుపోయినట్లు భావించామని ఆయన వెల్లడించారు. తమకు అందుబాటులో ఉన్న మార్గాలన్నీ మూసుకుపోయాయని, మీడియా సహా ఏదీ తమకు అనుకూలంగా లేదని అన్నారు.

ఈ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలోనే తమ పార్టీ చరిత్రను గుర్తుచేసుకుని, కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర (భారత్ జోడో యాత్ర) చేయాలని నిర్ణయించుకున్నట్లు రాహుల్ గాంధీ వివరించారు. తాను కశ్మీర్‌లో యాత్రను ముగించినట్లు గుర్తుచేశారు. ఈ పాదయాత్ర ద్వారా తాను ముఖ్యంగా రెండు విషయాలు నేర్చుకున్నానని ఆయన వెల్లడించారు."ప్రపంచవ్యాప్తంగా మా ప్రత్యర్థులు కోపం, భయం, ద్వేషంపై గుత్తాధిపత్యం కలిగి ఉన్నారు. ఆ విషయంలో వారితో పోటీ పడటం మా వల్ల కాదు. కోపం, భయం, ద్వేషం విషయంలో వారు ప్రతిసారీ మమ్మల్ని అధిగమిస్తారు, ఓడిస్తారు" అని రాహుల్ గాంధీ అన్నారు. ఈ నేపథ్యంలో తాము ఎక్కడ, ఎలా పని చేయాలనే అంశాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. తమను తాము నిర్మించుకునే అవకాశం ఎక్కడ ఉందో ఆలోచించామని అన్నారు.

# మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తా

## మత్స్యకారుల సేవలో పథకాన్ని ప్రారంభించిన చంద్రబాబు



శ్రీకాకుళం **ఏప్రిల్ 26 ఆంధ్ర ప్రగతి:** టీడీపీకి వెనుకబడిన వర్గాలే వెన్నెముక అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. స్థానికుల సమస్యలు, పేదల కష్టాలు చూశానని.. కొందరు జాలర్ల ఆదాయం కూడా కాజేస్తున్నారని తెలిపారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులున్నా మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా 'మత్స్యకారుల సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో వెనకబడిన వర్గాలన్నీ కూటమికి అండగా నిలిచాయని.. వెనుకబడిన వర్గాల కోసం మరిన్ని కార్యక్రమాలు తీసుకొస్తామని సీఎం వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారని.. వైసీపీ హయాంలో తీసుకొచ్చిన రుణాలు ఏం చేశారో కూడా లెక్కలు లేవని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే జాలర్ల దశదిశ మారిందన్నారు. వేట విరామ సమయంలో జాలర్లకు ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. మత్స్యకార కుటు-ంబాలకు రూ.20 వేల చొప్పున సాయం అందిస్తున్నామని తెలిపారు. పథకం కింద 1,29,178 కుటు-ంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరుతోందని చెప్పారు. 'గత నాయకుల మాదిరిగా మేము కూడా బటన్ నొక్కొచ్చు కానీ.. నేరుగా మీ దగ్గరికే వచ్చాం.. మీ సమస్యలు తెలుసుకున్నాం. మీ కష్టాలు తెలుసుకుని నేరుగా పథకాలు అందిస్తున్నాం' అని తెలిపారు. అన్ని మత్స్యకార గ్రామాలను బాగుచేస్తామని తెలిపారు. ప్రభుత్వం బాధ్యతగా ఉండాలని.. ప్రజల ఆదాయం పెంచాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను ప్రభుత్వం మెరుగుపరిచాలన్నారు. గతంలో నేతలు వస్తే చెట్టు- నరికేయడం.. పరదాలు కట్టడం జరిగేవని విమర్శించారు. గతంలో ఉద్దానం ప్రాంతానికి ఎర్రన్నాయుడు నీళ్లు సాధించారని గుర్తుచేశారు. ఇప్పుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తికాబోతోందన్నారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు రావాలన్నారు. 9 షిప్పింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నామని..ఏడాదిలోగా షిప్పింగ్ హార్బర్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్య సంపదలో ఏపీ నుంచే 29శాతం అని చెప్పుకొచ్చారు. మత్స్యకారుల పిల్లలను బాగా చదివించే బాధ్యత తీసుకుంటామన్నారు. ఇప్పటికే 6 రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు- చేశామని..అవకాశాలను ఉపయోగించుకుని ముందుకు సాగాలని అన్నారు. ఎచ్చెర్లలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు- చేస్తామని తెలిపారు. స్థానికులకే ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మా కంటే చిన్న వయస్సులో ఉన్నవారిలా చంద్రబాబు అహర్నిశలు పనిచేస్తున్నారు. వేట నిషేధ భృతి పెంచుతానని హామీ ఇచ్చి మాట నిలబెట్టు-కున్నారు. జీవో 217 కూడా రద్దు చేసి మత్స్యకారుల హక్కులు కాపాడారు. వెనుకబడిన జిల్లా అంటూ విని విని విని బాధపడుతూ వచ్చా .. శ్రీకాకుళం సెట్ ఇవ్వాలంటే.. మన మైండ్ సెట్ మారాలి. సుదీర్ఘ తీర ప్రాంతంలో ఒక్క పోర్ట్ లేకపోయింది. పోర్ట్‌తో పాటు- ఎయిర్ పోర్ట్ కూడా నిర్మిస్తాం. కేంద్రంతో మాట్లాడి జెట్టీలు, హార్బర్‌లు నిర్మిస్తాం. ఏం తక్కువ మన జిల్లాకు. అన్ని వనరులు ఉన్నాయి. యువత ఉపయోగించుకోవాలి.. సహకారం అందిస్తాం' అని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. కాగా.. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా మత్స్యకార కుటు-ంబాలకు రూ.20 వేల చొప్పున సాయం అందిచనున్నారు. సముద్రంలో వేట విరామ సమయంలో ఆర్థిక సాయం అందించనున్నారు.ఈ పథకం కింద 1,29,178 కుటు-ంబాలకు రూ.258 కోట్ల లబ్ధి చేకూరనుంది.

# చంద్రబాబు అప్పుడూ..ఇప్పుడూ విలనే

**అనవసరంగా హీరోగా చూపిస్తున్నారు**

**ఏడాది పాలనలో ఒక్క హామీ నెరవేర్చలే**

**మాజీమంత్రి అంబటి రాంబాంబు విమర్శలు**



గుంటూరు,**అమరావతి ఏప్రిల్ 26 ఆంధ్ర ప్రగతి:** చంద్రబాబు ఏడాది కాలం పాలనలో ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదని సీఎం చంద్రబాబు నాయుడపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన.. ఏమీ చేయకపోయినా చంద్రబాబును హీరోలా చూస్తున్నారు.. అసలు చంద్రబాబు హీరో కాదు.. విలన్.. గతంలోనూ విలన్ లాగే వ్యవహరించారని హాట్ కామెంట్లు చేశారు.. సోషల్ మీడియా సైకోల తోక కత్తిరిస్తానని అధికారంలోకి రాగానే చంద్రబాబు ప్రగల్భాలు పలికారు. సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టేవారి కోరలు పీకేస్తామన్నారు. పీడీ యాక్ట్ పెట్టి తాటతీస్తామన్నారు.. చంద్రబాబు అసభ్యకర మైన పోస్టులు పెట్టే వారిని ప్రోత్సహిస్తూనే ఉన్నారని.. కానీ, వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు.. జగన్ మోహన్ రెడ్డి ఆయన కుటు-ంబ సభ్యులపై చాలా దారుణమైన పోస్టులు... వ్యాఖ్యలు చేశారు అని ఆవేదన వ్యక్తం చేశారు అంబటి.. చేబ్రోలు కిరణ్ ను పెంచిపోషించింది చంద్రబాబు కాదా..? చేబ్రోలు కిరణ్ ఎంతో మందిపై చాలా దారుణంగా మాట్లాడాడు. చేబ్రోలు కిరణ్ ను అరెస్ట్ చేసి.. వదిలేశారు.. చేబ్రోలు కిరణ్ విడుదలైనంత తొందరగా సోషల్ మీడియా కేసులో అరెస్ట్ అయిన వారెవరూ విడుదల కాలేదు.. వైసీపీ నుంచి ఎవరు అరెస్ట్ అయినా వారిని పిటిషన్ వేసి కస్టడీకి తీసుకుంటు-న్నారు.. కానీ, చేబ్రోలు కిరణ్ ను మాత్రం పోలీస్ కస్టడీకి తీసుకోలేదు అని ఫైర్ అయ్యారు.. చంద్రబాబు పెంచి పోషించాడు కాబట్టే చేబ్రోలు కిరణ్ కేసులో 24 గంటల్లో విచారణ పూర్తయిపోయింది.. చంద్రబాబు చేయించిన ఏ అరెస్ట్ లోనూ ఇంత త్వరగా విచారణ పూర్తికాలేదు.. చంద్రబాబు డైరెక్షన్ లో కొన్ని వందల మంది ఐ-టిడిపిలో పనిచేస్తున్నారు.. ఎవరిని ఎక్కువ బూతులు తిడితే వారిని అంత పోషిస్తామని చెబుతున్నారు.. చంద్రబాబు మాటలన్నీ దొంగమాటలు అని దుయ్యబట్టారు. స్వాతి రెడ్డి అనే సోషల్ మీడియా కార్యకర్త పేరు స్వాతి చౌదరి .. జగన్ మోహన్ రెడ్డి ఫోటోలు మార్ఫింగ్ చేయించేది చంద్రబాబు, లోకేష్ అని ఆరోపించారు.. టిడిపిని మేం ప్రశ్నిస్తే వాళ్లకంటే ముందు సీమ రాజా అనేవాడు స్పందిస్తాడు. వైసీపీ కండువా వేసుకుని టీ-డీపీ తరపున మమ్మల్ని తిడతాడు. సీమరాజాపై ఒకసారి కేసుపెట్టా.. మళ్లీ పెడతా అని హెచ్చరించారు. కిరాక్ ఆర్పీ.. రోజూ జగన్ మోహన్ రెడ్డిని.. నన్ను.. రోజాను తిడతాడు.. చంద్రబాబుతో ఫోటోలు దిగుతాడు. వ్యక్తిత్వ హననం చేయడం చంద్రబాబుకి వెన్నతో పెట్టి విద్య అని విమర్శించారు.. ఎన్టీఆర్ తో మొదలుపెట్టి ఇప్పటికీ ఎదుటి వారి వ్యక్తిత్వాన్ని హననం చేస్తూనే ఉన్నాడు.. వ్యక్తిత్వ హననం చేసి చంద్రబాబు పైశాచికానందం పొందుతున్నాడు. సోషల్ మీడియాలో వారిని పెంచి పోషించేది వారికి డబ్బులిచ్చేది చంద్రబాబే.. సోషల్ మీడియాలో పనిచేస్తే పేమెంట్ ఇస్తానని చెప్పింది చంద్రబాబు.. ఎవరు బాగా తిడితే వారికి ఎక్కువ పేమెంట్ ఇస్తామని సాక్షాత్తూ చంద్రబాబే చెప్పారని.. యూ ట్యూబ్ లలో సైతం ఎంతో దుర్మార్గంగా.. దారుణమైన పోస్టులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. మార్ఫింగ్ చేసిన పోస్టులు పెట్టిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరు.. చేబ్రోలు కిరణ్ వంటి వారిని పెంచి ప్రోత్సహిస్తూ.. మహిళలను ఏదైనా అంటే సహించేది లేదని బిల్డప్ ఇస్తున్నారని మండిపడ్డారు అంబటి రాంబాబు.. చంద్రబాబుని మోసేది సీమరాజా, కిర్రాక్ ఆర్పీ వంటి వారే.. ఇంత నీచమైన స్థితికి టిడిపి దిగజారిపోవడం బాధాకరం.. ఐ-టిడిపి ద్వారా జరుగుతున్న నీచమైన ప్రచారాలకు చంద్రబాబు చెక్ పెట్టాలి.. ఏ ఒక్కరినీ వదలం అందరి పైనా కేసులు పెడతాం అని హెచ్చరించారు.. ఇక, అనిత పేరుకే హోంమంత్రి.. హోంశాఖ గురించి ఆమెకు తెలియదు... హోంశాఖను నడిపించేది లోకేష్ అని ఆరోపించారు.. మా ఫిర్యాదుల పై పోలీసులు కేసులు రిజిస్టర్ చేయకపోతే న్యాయపరంగా పోరాడుతాం అన్నారు.. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వికృతచేష్టల పై పోరాడుతామని ప్రకటించారు మాజీ మంత్రి అంబటి రాంబాబు..

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 27 ఏప్రిల్ 2025

# ఉగ్ర తీవ్రవాదులను స్వాతంత్ర సమరయోధులు అనడం

# వెనుక పాకిస్తాన్ రాజకీయ కుట్ర కాదా..?

## -జమ్ము కాశ్మీర్లో జరిగిన ఉగ్రదాడులు దేశానికే కాకుండా సరిహద్దు రాష్ట్రాలకు ప్రమాదం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఏప్రిల్ 26:**
ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాదం ప్రజలకు కూడా పెద్ద ఆందోళన కలిగించే అంశం అని చెప్పాలి, దాడులు చాలా అరుదు. కానీ తరచూ బాధాకరమైన దిగ్భ్రాంతికరమైన వాటిలో బయట పెట్టడానికి మరియు అణిచి వేయడానికి ఉగ్రవాదులు తమ భావాలను బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తూనే ఉంటారు. తమ స్వీయ విషయాల రక్షణ కోసం సమాజ వ్యతిరేక మార్గాలను ఉగ్రవాదులు మానసికంగా చూస్తే ఏదో రుగ్మత సామాజికంగా చూస్తే ఏదో పైశాచికత్వం, మతపరంగా చూస్తే ఇది నిషిద్ధం ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాది కార్యకలాపాలు మూలంగా ఎంతోమంది అమాయకులైన ప్రజలు చనిపోతున్నారు. గతంలో మన భారత హోం మంత్రి విభాగం తన వెబ్సైట్లో నిషేదింపబడ్డ తీవ్రవాద ఉగ్రవాద సంస్థల జాబితా చూసినట్లయితే అందులో అతి క్రూరంగా ప్రవర్తించే 36 సంస్థలు ఉన్నట్లు తెలుస్తుంది. దేశంలో జరిగిన ఉగ్రదాడులు మన దేశానికి తీవ్ర ప్రమాదం కలిగించాయి సాధారణ ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించినాయి. ఈ నెల 22వ తారీఖున మిట్ట మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. యావత్తు దేశము ఈ సంఘటనను ముక్తకంఠముతో వ్యతిరేకిస్తూ ప్రజలు గొంతుక వినిపిస్తున్నారు. శాంతి ర్యాలీలు,నిర్వహించారు.
పర్యాటకులే లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో ఇద్దరు విదేశీయులు, ఇద్దరు ముస్లిం మైనార్టీలు, క్రైస్తవ మైనార్టీలు, హిందువులు సహా మొత్తం 27 మంది టూరిస్టులు మరణించినట్లు మనకు తెలుస్తుంది పలువురు గాయపడ్డారు క్షతగాత్రులను పహల్గామ ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసినదే .ఈ కాల్పులకు తామే బాధ్యులమని పాకిస్తాన్ టెర్రరిస్టులు ఆధునిక ఉగ్రవాదం రాజకీయ లక్ష్యాలను సాధించడానికి వివిధ వ్యూహాలను భయాన్ని వ్యూహాత్మక సాధనంగా ఉపయోగిస్తుంది.

**ఉగ్రవాదుల్ని అక్రమ చొరబాటుదారులను నియంత్రించకపోతే సామాన్య టూరిస్టులకే కాదు దేశానికే ప్రమాదం.!**

ప్రపంచంలో ఎక్కడ జరిగిన ఉగ్రవాదం ప్రమాదకరంగా మారింది. దానిని నియంత్రించాలి ఉగ్రవాదానికి ప్రత్యేక నిర్వచనం లేదు ఇది ఒక సమూహం తమ డిమాండ్ల నెరవేరనప్పుడు వారు తమ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి ప్రదర్శించాలనుకున్నప్పుడు సమాజం పట్ల వ్యక్తీకరించే దుర్మార్గమైన ప్రాణాలు తీసే మార్గం. సాంకేతికంగా ఉగ్రవాదాన్ని భయంకరమైన భయాన్ని వ్యాప్తి చేయడానికి మరియు ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించడానికి హింసకు పాల్పడుతుంటారు. దానినే కీలకమైన ఆయుధంగా ఉగ్ర తీవ్రవాదులు ఉపయోగిస్తారు. ఉగ్రవాద చర్యలకు అనేకమంది ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఆధునిక ఉగ్రవాదం అంటే దీనిలో రాజ్యానికి వ్యతిరేకంగా కాకుండా రాజ్యంపై దౌర్జన్యాన్ని వ్యవస్థాగతంగా ఉపయోగించడం జరుగుతుంది. ఇది 1870 వ సంవత్సరంలో యూరోప్లో ఆవిర్భవించింది. సాధారణంగా మొట్టమొదటి ఉగ్రవాదిగా గుర్తించబడిన వ్యక్తి 26 సంవత్సరముల వయస్సులో సామాజిక విప్లవకారుడు వెరా జాసులిచ్ అనే అతను 1878 వ సంవత్సరంలో దేశీయ రాజకీయ నిరసనలను రష్యన్ విప్లవ ఉద్యమం ఒక నిర్దిష్ట స్థాయిలో అహింస పదము ద్వారా ప్రజలం. అదేవిధంగా ఉగ్రవాదం యొక్క వినాశనకరమైన ప్రభావాలు మనకు తెలుసు మరియు వాటిని అరికట్టడానికి మనకు అంతర్జాతీయంగా వర్తించే మరియు చాలా సహాయ సహకారిగా ఉండే కొన్ని నిబంధనలు ఉన్నాయి. కానీ ఉగ్రవాదులను అణిచివేయడానికి అవి సరిపోవటం లేదు. ఒకవేళ అవి సరిపోతే ప్రతి సంవత్సరము ఉగ్రవాద ,తీవ్రవాద దాడిని ఎదుర్కోవలసినా అవసరము ఉండదు. కాబట్టి మనకు మరింత కఠినమైన నిబంధనలు అవసరము ఇతరుల ప్రాథమిక హక్కులు మరియు వారి స్వేచ్ఛలను నాశనం చేయడాన్నికీ ఉగ్రవాదులకు హక్కు ఎక్కడిది? అందులో తీవ్రవాదులు ప్రధానంగా టార్గెట్ చేసేది, రవాణా కేంద్రాలు, షాపింగ్ కేంద్రాలు, పర్యాటక కేంద్రాలు, విమానాశ్రయాలు, జనసాంద్రత కలిగిన ప్రజా ప్రాంతాలను, పెద్ద పెద్ద టవర్లను, లక్ష్యంగా చేసుకుంటూ వారి యొక్క ఉనికిని చాటుకుంటున్నారు. ఉగ్రవాదుల్ని అక్రమ చొరబాడుదారులను నియంత్రించకపోతే సామాన్య పర్యాటక టూరిస్టులకే కాకుండా దేశానికి ప్రమాదం ఏర్పడుతుంది. అదేవిధంగా భద్రతా చర్యలపై విశ్వాసాన్ని దెబ్బతీయడం లక్ష్యంగా పెట్టుకుంటుంది ఉగ్రవాది మరియు ఉగ్రవాదం అనే పదాలు 18 వ శతాబ్దం చివరి ఫ్రెంచ్ విప్లవం సమయంలో ఉద్భవించాయి ఇలాంటి ఉగ్రవాదదాడులు ప్రపంచంలో ఎక్కడ జరిగినా ఆయా దేశాలకు పెద్ద ప్రమాదకరంగా ఉంటుందని చెప్పాలి. అయితే జమ్మూ కాశ్మీర్లో ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన మన భారత పౌరులకు నివాళులర్పిస్తూ ర్యాలీలు దేశవ్యాప్తంగా చేస్తున్నారు ఇలాంటి సంఘటనలు



**డాక్టర్ జి. బాలస్వామి**
**న్యాయవాది మరియు ఫ్రీ లాన్స్ జర్నలిస్టు.**

పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలని భారతదేశానికి రక్షణ కల్పించవలసిందిగా దేశ ప్రజలందరూ కోరుకుంటున్నారు.
ఈ సంఘటన జరిగిన తర్వాత ఒక రిటైర్డ్ మిలిటరీ అధికారి జీ.డి బక్షి మాట్లాడుతూ కోవిడ్ టైంలో మూడు సంవత్సరాల పాటు ఆర్మీ రిక్రూట్మెంట్ జరగలేదు మన సైన్యములో 1,80,000 మందిని తగ్గించేశారు అంటూ ఇలా చేసింది ఎవరు? మీరు డబ్బు ఆదా చేశారు, వీళ్లు టెర్రరిస్టులు ఇలా చేయడానికి దాడి మీరు ఆ డబ్బు ఆదా చేశారా? అంటూ ఆర్మీ ని తగ్గించాలని నిర్ణయము ఏ మేధావిధి? ఆర్మీ ని సైజును తగ్గించిన ఆ మేధావి ఎవరు? అని ఆవేదనతో చైనా పాకిస్తాన్ లకు తోడుగా మన మెడ చుట్టూ వేలాడుతున్న బంగ్లాదేశ్ తో ఫైట్ చేయాలంటే సైనిక బలం అత్యవసరము అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులు మన పౌరులను కాల్చివేస్తుంటే మన సైన్యం సరైన సమయానికి అందుబాటులో లేకపోయింది. ఎక్కడున్నారు అంటూ తన ఆవేదనను సామాజిక మాధ్యమాల ద్వారా చెప్పడం జరిగింది. చాలా బాధాకరమైన సంఘటన, కాశ్మీర్లో జరిగిన ఉగ్రవాద దాడుల్లో 27 మందిని ఊచకోత కోశారు ఉగ్రవాదానికి మతం లేదు! కులం లేదు! నలుపు,తెలుపు అనే తేడా కూడా లేదు! ఉగ్రవాదులు మన దేశ పరువు తీయడానికి విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు మన దేశం అంత సురక్షితం కాదని ప్రపంచానికి చాటి చెప్పటానికి ఉగ్రవాదులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు.
కాశ్మీర్ లో అక్రమంగా పాకిస్తాన్ నుంచి మన దేశంలోకి ప్రవేశించి ఉగ్రవాదులు 27 మందిని ఊచకోత కోసిన సంఘటన జరిగినది. ఇంకో వైపు గంటలోపే బీజేపీ పార్టీ నాయకులు లేదా కార్యకర్తలు ముస్లింల మీద ద్వేషాన్ని రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం మొదలుపెట్టారు. ఇది దేశానికి మంచిది కాదు ఎందుకంటే ముస్లిం మైనార్టీలు కూడా ఇద్దరూ ఉగ్రవాదుల చేతులు ఊచకోతకు గురయ్యారు. అదేవిధంగా ఎంతోమంది టూరిస్టుల ప్రాణాలు కాపాడిన ఆదిల్ హుస్సేన్ కాశ్మీర్ యువకుడు చాలా పేద కుటుంబానికి చెందిన వ్యక్తి చివరకు ఆ యువకుడు కూడా ప్రాణాలు కోల్పోయాడు.
బీజేపీ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ల మీద కూడా ముస్లింలను నేరుగా టార్గెట్ చేస్తూ,హింసను ప్రేరేపించే విధంగా సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెడుతున్నారు. మరి దేశంలో పదకొండేళ్లుగా బీజేపీనే అధికారంలో ఉన్నది. సరిహద్దులు దాటి ఈ దేశంలోకి టెర్రరిస్టులు వచ్చి అమాయక ప్రజలను దారుణంగా హతమారిస్తే దానికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వందే అవుతుంది. అదేవిధంగా దీనికి ప్రభుత్వం కూడా నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుంది కదా,! నిన్న ఉగ్రవాద ఉన్మాదులకు ముస్లిం అనే తేడా లేదు, హిందూ అనే తేడా లేదు, క్రైస్తవం అనే తేడా లేదు, ధనవంతుడా, మధ్యతరగతివాడ, పేదవాడ, అని తేడాలు ఉండవు అందరూ కూడా వారి చేతిలో మరణించారు చాలా బాధాకరమైన విషయం. బాధిత కుటుంబాలలో వారి కన్నీటి శోకం,దుఃఖం, బరువైన బాధ అనుభవించిన వారికి తెలుస్తుంది. కానీ యావత్తు దేశము పెద్ద ఎత్తున ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తుంది. కానీ కొంతమంది చేసే ప్రచారం
ఈవిషయం మనలో అత్యధిక మందికి తెలియదు.
దేశం ఇప్పటికే పేలడానికి సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతంలా ఉన్నది. ఇలాంటప్పుడు అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం ఒక మతం మీదికి ఇంకో మతం పైకి ప్రజలను ఉసిగొల్పే విధంగా రెచ్చగొట్టడం ఎంతవరకూ సబబు? అనే విషయాలను ఆలోచించాలి.
ఉగ్రవాదులకు కావల్సిందే ఇదే. మన దేశంలో మతం పేరిట మంటలు రగుల్తే ఆ ఉగ్రవాదుల ప్లాన్ సక్సెస్ అయినట్టే. సామాజిక మాధ్యమాల ద్వారా
వాట్సాప్ లో ముస్లింల మీద నిత్యం ద్వేషాన్ని నూరిపోసే పోస్టులను ఫార్వార్డ్ చేసే మిత్రులు దేశం పట్ల ప్రేమతో భక్తితో ఒకసారి అలోచించండి. మనమంతా భారతీయులం అనే విషయాన్ని మనం మర్చిపోకూడదు.
నిన్న ఉగ్రదాడి జరుగుతున్న సమయంలో మన ప్రధాని నరేంద్ర మోడీ గారు విదేశీ పర్యటనలో ఎక్కడున్నారు అనే విషయం మన అందరికీ తెలుసు.
ఆయన ఈ ప్రపంచంలోనే అత్యంత మత ఛాందస ముస్లిం దేశాల్లో ఒకటైన సౌదీ అరేబియా రాజధాని జెడ్డా లో అక్కడి పాలకుల ఆతిథ్యం స్వీకరిస్తున్నారు. ఇది వాస్తవమే కదా!
మరి ముస్లింలు అందరూ టెర్రరిస్టులని, మన వీధి చివర పూలమ్ముకునే, పండ్లమ్ముకునే పేద ముస్లింల షాపులను బాయ్కాట్ చేయాలని ఇక్కడ మన గ్రామాల్లో, పట్టణాల్లో బీజేపీ పార్టీ అనుబంధ సంస్థలు విషం నూరిపోస్తుంటే , ఒక ఛాందసవాద ముస్లిం దేశంలో మోదీ ఏం చేస్తున్నారు?
ఇక్కడ ముస్లింలను "పంచర్లు అతికే వాళ్లు" అని హేళన చేసే నరేంద్ర మోదీ ఎందుకు మరి ముస్లిం దేశాలకు వెళ్లి అక్కడి పాలకులను ఆలింగనం చేసుకుంటున్నాడో ఒక్క క్షణం ఆలోచించండి.
బతుకుతెరువు కోసం పంచర్లు అతుక్కునో, పూలమ్మో, పండ్లమ్మో తోపుడుబండ్లను దొబ్బుకుంటూ బతుకువెళ్లదీస్తున్న లక్షలాది పేదవారిని మతం ముద్రవేసి, వారి బతుకుదెరువును దెబ్బతీస్తే, జీవనోపాధికి ఇక ఏ ఆధారమూ లేక వారు అతివాదం వైపు మళ్లితే ఈ దేశం రావణకాష్టం కాదా?అనే విషయాన్ని ఆలోచించాలి. ఈ సోయి మన కేంద్ర ప్రభుత్వం పెద్దలకు తెలియలేదా?
తీవ్రవాదాన్ని అందరం వ్యతిరేకించాలి. మతం పేరిట ఎవరు హింసను రెచ్చగొట్టినా దాన్ని ఖండించాల్సిందే. కానీ తీవ్రవాదులను బూచిగా చూపి దేశంలోని పేద ముస్లిముల మీదికి మెజారిటీ ప్రజలను ఎగదోసి ఆ మంటల్లో చలిగాచుకునే బిజెపి పట్ల అప్రమత్తంగా ఉండాలి.
నిన్నటి ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారిలో అన్ని మతాలవారు ఉన్నారు. కాబట్టి భారతీయుల మందరము కలిసికట్టుగా ఉంటూ లౌకిక భావాలకు పెద్దపీట వేస్తూ ఉగ్రవాదులు ఇలాంటి దాడులకు పాల్పడినప్పుడు మనమంతా ఒకటే అంటూ దేశభక్తిని చూపుతారని కోరుకుందాం..

# మద్యం సేవించి వారిపై కేసు నమోదు చేసిన పోలీసులు.

**-కట్టుదిట్టంగా నిర్వహిస్తున్న రాత్రిపహారాలు.. అనుమానితుల వేలిముద్రాలను పరిశీలిస్తున్న పోలీసులు మరియు సి సి ఎస్ టీమ్ బృందాలు.**

**-శాంతిభద్రతల నియంత్రణ ,సైబర్ నేరాలపై అవగాహన కార్యాక్రమాల నిర్వహణ.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ ఏప్రిల్ 26:**
నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం మరియు మధ్యం,ఇసుక,గంజాయి ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా జరుగకుండా నియంత్రించుటకు,శాంతిభద్రతల పరిరక్షణ కొరకు ప్రతిరోజు క్రమం తప్పకుండా విజిబుల్ పోలిసింగ్ నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా నిన్న ,నేడు పోలీసు అధికారులు సిబ్బంది విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. నైట్ బీట్లలో భాగంగా ప్రతి రోజూ సిబ్బంది వారి స్టేషన్ పరిదిలోని నేరచరిత్ర గలవారిపై,అనుమానితులపై మరియు రాత్రి వేళలో అనవసరంగా తిరిగే వారిపై దృష్ఠి నిఘా ఉంచుతూ అనుమానితుల వేలిముద్రలు తీసుకొని రాత్రి పూట దొంగతనాలు, అల్లర్లు ,గొడవలు జరగకుండా, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అర్ధరాత్రి దాటాక తెల్లవారుజాము వరకు రాష్ట్రీయ/ జాతీయ రహదారులపై వెళ్తున్న లారీలు, తదితర వాహనాలను ఆపి డ్రైవర్లకు ఫేష్ వాష్ అండ్ గో కార్యక్రమం కొనసాగిస్తున్నారు.
జిల్లాలో శాంతిభద్రతల నియంత్రణ, సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణ కొరకు వివిద పోలీసు స్టేషన్ ల పరిదిలో గ్రామాలు/పట్టణాలలో పోలీసు అధికారులు గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కార్యాక్రమాలు ఏర్పాటు చేసి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోవద్దని,మియొక్క వ్యక్తిగత వివరాలు అనగా ఓటిపి ,బ్యాంక్ వివరాలు,ఫోటోలు ,అధార్ వివరాలు మొదలగునవి ఎవ్వరికీ పంపరాదని,ఎవరైనా మోసపోతే 1930 నెంబర్ కి లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ %www.cybercrime.gov.in% లో గాని మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కి వెళ్ళి గాని ఫిర్యాదు చేయాలని తెలియజేశారు. జిల్లా పోలీసులు రోడ్డు ప్రమాదాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నా నిభందనలు ఉల్లంఘించిన వారిపై మోటారు వాహన చట్టాన్ని ఉపయోగించి గడిచిన 48 గంటల్లో డ్రైవింగ్ మోటారు వాహనచట్టాన్ని ఉల్లంఘించి వాహనాలు నడిపే 647 మందిని గుర్తించి 3,08,725/-రూపాయలను జరిమాన విధించడం జరిగింది. అదేవిదంగా 139 మంది నుండి 65,090/- రూపాయలను జరిమానను రికవరీ చెయ్యడం జరిగింది. మద్యం సేవించి వాహనాలు నడిపే 59 మందిని గుర్తించి కేసులు నమోదు చెయ్యడం జరిగింది. నేర నియంత్రణ శాంతిభద్రతల పరిరక్షనే లక్షంగా విజిబుల్ పోలిసింగ్ లో భాగంగా చట్ట విరుద్ధంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నేరమని తెలియజేస్తూ 198 కేసులు నమోదు చేయడం జరిగింది. ప్రజల జీవితాలను నాశనం చేసే చట్ట వ్యతిరేక కార్యకలాపాలైన మట్కా ,జూదం మొదలగు వాటి నియంత్రణకు నిఘా ఏర్పాటు చెయ్యడం జరిగింది .ఈ సంధర్బంగా పాములపాడు పోలీసు స్టేషన్ పరిదిలో పేకాట ఆడుచున్నారని రాబడిన సమాచారం మేరకు ఎస్సై వారి సిబ్బంది సహాయంతో దాడి చేసి ఒక కేసు నమోదు చెయ్యడంతో పాటు 07 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి తదుపరి చర్య నిమిత్తం 3890/-రూపాయలను స్వాదినం చేసుకోవడం జరిగింది. జిల్లాలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే డయల్ - 100/112 లేదా సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# కన్నడ నటి రన్యారావుకు హైకోర్టులో చుక్కెదురు

## బెయిల్ పిటిషన్ను కొట్టివేసిన కర్ణాటక హైకోర్టు

**ఏప్రిల్ 26 ఆంధ్ర ప్రగతి:**
14.7 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ బంగారం అక్రమ రవాణా కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యారావుకు కర్ణాటక హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆమెతో పాటు మరో నిందితుడు తరుణ్ కొండూరు రాజు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. జస్టిస్ ఎస్. విశ్వనాథ్ శెట్టి ఈ మేరకు తీర్పు వెలువరించారు. డీఆర్ఐ అధికారుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, నిందితుల అభ్యర్థనలను తోసిపుచ్చారు.
గత నెలలో దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తరలిస్తూ రన్యారావు బెంగళూరు విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులకు పట్టుబడిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆమె వద్ద నుంచి సుమారు 14.7 కిలోల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో రన్యాతో పాటు ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేశారు. అయితే, ఈ వ్యవహారంలో తన ప్రమేయం లేదని, తనను బెదిరించి ఇరికించారని రన్యారావు మొదట చెప్పినట్లు అధికారులు తెలిపారు. కానీ, డీఆర్ఐ లోతైన దర్యాప్తులో భాగంగా, ఈ బంగారం అక్రమ రవాణాలో రన్యారావు కొన్నేళ్లుగా కీలక పాత్ర పోషిస్తున్నట్లు తేలిందని అధికారులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆమెకు బెయిల్ మంజూరు చేయవద్దని గట్టిగా వాదించారు. ఈ కేసులో మూడో నిందితుడిగా (ఏ3) ఉన్న ఆభరణాల వ్యాపారి సాహిల్ జైన్ను కూడా డీఆర్ఐ అధికారులు అదుపులోకి



తీసుకున్నారు. కాగా, బెయిల్ కోసం రన్యారావు చేసిన ప్రయత్నాలు ఇప్పటికే రెండుసార్లు విఫలమయ్యాయి. ఆర్థిక నేరాల ప్రత్యేక న్యాయస్థానం, 64వ సెషన్స్ కోర్టులలో ఆమె బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురయ్యాయి. తాజాగా హైకోర్టు కూడా బెయిల్ నిరాకరించింది.

# ఎస్ఎల్బీసీ టన్నెల్లో సహాయక చర్యలు నిలిపివేత

## నిపుణుల కమిటీ సూచనలతో అధికారుల నిర్ణయం



నాగర్ కర్నూలు **ఏప్రిల్ 26 ఆంధ్ర ప్రగతి:**
: తెలంగాణ రాష్ట్రాన్ని కుదిపేసిన ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంలో గల్లంతైన వారి కోసం గత 63 రోజులుగా అవిశ్రాంతంగా కొనసాగిన రెస్క్యూ ఆపరేషన్కు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇద్దరి మృతదేహాలను వెలికితీసిన రెస్క్యూ సిబ్బంది, మిగిలిన ఆరుగురి కోసం తవ్వకాలు జరుపుతున్నారు. అయితే, టన్నెల్లో నిరంతరం పనిచేసిన ఎక్స్కవేటర్లు గురువారం బయటకు వచ్చాయి. శిథిలాల తొలగింపు దాదాపు పూర్తయినప్పటికీ, ప్రమాదకరమైన జోన్లో మాత్రం ఇంకా తొలగించాల్సి ఉందని అధికారులు తెలిపారు. సాంకేతిక కమిటీ సూచనల మేరకు, సహాయక చర్యలను మూడు నెలల పాటు నిలిపివేశారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఎస్-ఎల్బీసీ టన్నెల్ ప్రాజెక్టులో ఫిబ్రవరి 22న దుర్ఘటన సంభవించిన విషయం తెలిసిందే. శ్రీశైలం ఎడమగట్టు కాలువ ఎస్ఎల్బీసీ)సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలను నిలిపివేయాలని సాంకేతిక కమిటీ- నిర్ణయానికి వచ్చింది. టన్నెల్ యొక్క ఇన్లెట్ వైపు నుండి 13.6 కిలోమీటర్ల తర్వాత ముందుకు వెళ్లడం సురక్షితం కాదని కమిటీ- స్పష్టం చేసింది. ఈ మేరకు, గురువారం జలసౌధలో రెవెన్యూ శాఖ (విపత్తులు) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ అధ్యక్షతన సాంకేతిక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఏపీలోని ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండెంట్, నేషనల్ జియోఫిజికల్ పరిశోధనా సంస్థ డైరెక్టర్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ- డైరెక్టర్, నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ భూశాస్త్రవేత్త , బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ (బీఆర్వో) నుండి టన్నెల్ నిపుణులు పరీక్షిత్ మెహ్రా పాల్గొన్నారు. వారి సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నారు.

# కంచి పీఠం 71వ పీఠాధిపతిగా ఏపీకి చెందిన గణేశ్ శర్మ





కంచి **ఏప్రిల్ 26 ఆంధ్ర ప్రగతి:** ఆంధ్రప్రదేశ్లోని అన్నవరంకు చెందిన రుగ్వేద పండితుడికి అరుదైన గౌరవం లభించింది. తమిళనాడులోని ప్రసిద్ధ కంచి కామకోటి పీఠం 71వ పీఠాధిపతిగా అన్నవరంకు చెందిన గణేశ్ శర్మ ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం అధికారిక ప్రకటన వెలువడింది. ప్రస్తుత పీఠాధిపతి శ్రీశంకర్ విజయేంద్ర సరస్వతి స్వామి ఆయనను ఎంపిక చేసినట్లు సంస్థానానికి చెందిన చల్లా విశ్వనాథశాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు. విజయేంద్ర సరస్వతి ఈ నెల 30న కాంచీపురం కామాక్షి ఆలయంలో ఆయనకు సన్యాస దీక్షను ప్రసాదిస్తారని విశ్వనాథశాస్త్రి పేర్కొన్నారు. అన్నవరంకు చెందిన దుడ్డు ధన్వంతరి, మంగాదేవి దంపతుల పెద్ద కుమారుడైన సత్య వెంకట సూర్య సుబ్రహ్మణ్య గణేశ శర్మ 1998లో జన్మించారు. 2006లో వేద అధ్యయన దీక్షను స్వీకరించిన గణేశ్ శర్మ ద్వారకా తిరుమల ఆలయంలో వేద విద్యను అభ్యసించారు. యజుర్వేదం, సామవేదం, షడంగాలు, దశోపనిషత్తులు అభ్యసించిన ఘనాపాటి గణేశ్ శర్మ కొన్నేళ్లుగా కంచి పీఠంలో శాస్త్ర అధ్యయనం చేస్తున్నారు. గణేశ్ శర్మకు ఈ అరుదైన గౌరవం లభించడం పట్ల అన్నవరం క్షేత్రంలోని వ్రత పురోహితులు, అర్చకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





# నంద్యాలలో వైభవంగా ఇండియన్ బ్యాంక్ ప్రారంభోత్సవం.

**-భారతదేశంలో ఏడవ పెద్ద బ్యాంక్ "ఇండియన్ బ్యాంక్"**

**-నంద్యాలలో మూడవ బ్రాంచ్ ప్రారంభం.-ఈ ఏడాది ఉమ్మడి జిల్లాల్లో 2 వేల కోట్ల టార్గెట్.**








**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 26:**
భారతదేశంలో పేదరికం నుంచి బయట పడాలంటే చదువే మార్గమని,ఉన్నతచదువులతో ఫ్రాక్షన్ కు చరమగీతం పాడొచ్చని ఆంధ్రప్రదేశ్,తెలంగాణ ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ జి రాజేశ్వర రెడ్డి పేర్కొన్నారు.నంద్యాల పట్టణం ఖలీల్ థియేటర్ ఎదురుగా ఇండియన్ బ్యాంక్ నూతన శాఖను అమరావతి జోన్,జోనల్ మేనేజర్ డి.ఎస్. మూర్తి,ఆంధ్రప్రదేశ్,తెలంగాణ ఫీల్డ్ జనరల్ మేనేజర్ జి రాజేశ్వర రెడ్డి లు ప్రారంభించారు. ఇండియన్ బ్యాంక్ నూతన శాఖను రిబ్బన్ కట్ చేసి బ్యాంక్ కస్టమర్లతో జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో పేదరికం నుంచి బయటపడాలంటే చదువే మార్గమని,ఉన్నత చదువులతో ఫ్రాక్షన్ కు చరమగీతం పాడొచ్చని అన్నారు.భారతదేశంలో 1907 లో ఇండియన్ బ్యాంక్ స్థాపించారని అన్నారు.ఇండియాలో ఏడవ పెద్ద బ్యాంక్ ఇండియన్ బ్యాంక్ అన్నారు.గత ఏడాది ఉమ్మడి జిల్లాలో 1800 కోట్ల వ్యాపారం జరిగిందని,ఈ ఏడాది 2 వేలకోట్ల వ్యాపార లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు.రెండు రాష్ట్రాల్లో ప్రజా స్పందన బాగుందని అన్నారు.కర్నూల్,నంద్యాల జిల్లాలో 12 బ్రాంచ్ లు ఉన్నాయని,త్వరలో మరిన్ని బ్రాంచ్ లు ఏర్పాటుచేస్తామని అన్నారు.గతంలో ఈ బ్రాంచ్ శ్రీనివాస సెంటర్లో మిద్దెపైన ఉండడంతో సీనియర్ సిటిజన్స్ ఇబ్బందులు పడేవారని,అందరి సౌకర్యం కోసం ఇక్కడ విశాలమైన ప్రాంతంలో ఏర్పాటు చేశామన్నారు.ఈ బ్రాంచ్ నంద్యాలలో 50 ఏళ్లుగా కొనసాగుతుందని అన్నారు.ఈ బ్యాంక్ లో గతంలో ఏడాదికి 160 కోట్ల వ్యాపారం జరిగేదని,ఈ ఏడాది 200 కోట్ల టార్గెట్ పెట్టుకున్నామని పేర్కొన్నారు.స్వయం సహాయక గ్రూపులు మహిళలకోసం నంద్యాలలో ఇండియన్ బ్యాంక్ ఉందని అన్నారు.అన్ని వర్గాల ప్రజలకు,చిన్న పిల్లల నుంచి, వ్యాపారస్తులకు, ఉద్యోగస్తులకు, ఉపాధ్యాయులకు,విద్యార్థులకు, సీనియర్ సిటిజన్స్ కు రుణ సదుపాయ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు.గత 23 ఏళ్లుగా వివిధ రాష్ట్రాల్లో పనిచేసి సొంత గడ్డలో పనిచేస్తున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు.నేను ఇంతటి ఉన్నత స్థాయికి రావడానికి అన్ని ప్రాంతాల్లో పనిచేస్తున్న బ్యాంక్ అధికారులు,సిబ్బంది కృషి అన్నారు.అన్ని రాష్ట్రాల్లో పనిచేస్తున్న అందరికీ పేరు,పేరు న కృతజ్ఞతలు తెలిపారు.బ్యాంక్ ప్రారంభోత్సవానికి నా మిత్రులు కంభం సతీష్ కుమార్, జయసింహ రెడ్డి లు రావడం సంతోషంగా ఉందని అన్నారు.ప్రధానంగా ఈ బ్యాంక్ లో పెద్ద,పెద్ద లాకర్ సౌకర్యం కల్పించామని అన్నారు.రుణాలు కావలసినవారికి బ్యాంక్ అధికారులు సహకరిస్తారని అన్నారు.అనంతరం బంగారు వ్యాపారి దిలీప్ కుమార్ తో ఏ.టి. ఎమ్ ను ప్రారంభించారు.బ్యాంక్ కస్టమర్లకు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ నూతన శాఖ మానేజర్ రాజా గుండప్ప,ఆర్ ఏ సి మేనేజర్ సంభ శివుడు,పద్మావతి నగర్ బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వర రావు,ఏబీఎం కడం శివ,లోన్ అధికారి ఖలీల్,క్యాషియర్ విష్ణు వర్ధన్,వినోద్ కుమార్,రామ కృష్ణా రెడ్డి,విష్ణు వర్ధన్,భాస్కర్ గుప్త పాల్గొన్నారు.

# శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల ఉద్యోగ మేళ లో 62 మంది ఎంపిక.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 26:**
పట్టణ శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల ఎస్బీఐ కాలనీ నందు శనివారం అనగా ఏప్రిల్ 26 న జరిగిన గ్రాండ్ ఉద్యోగమేలలో దాదాపు 62 మంది ఉద్యోగాలు సాధించారని కళాశాల డైరెక్టర్ జి హేమంత్ రెడ్డి తెలిపారు ఆయన మాట్లాడుతూ హైదరాబాద్, చెన్నై, బెంగళూరు కేంద్రంగా దాదాపు 10 కంపెనీలు ఈ ఉద్యోగం మేళ పాల్గొనగా వీటిలో ఉద్యోగాల కోసం పట్టణ మరియు పరిసర ప్రాంతాల నుండి సుమారు 130 మంది విద్యార్థులు పాల్గొన్నారనీ ఆయన మాట్లాడుతూ.. శ్రీరామకృష్ణ విద్యాసంస్థలలో ఉద్యోగమేల నిర్వహించిన ఎన్ఐఐటి, రీసెల్యూట్, టాటా ట్రెండ్, ప్రమోట్ పర్సనల్, పెటీయం , జస్ట్ డయల్ , ఎల్ మరియు టి, ఎంఆర్ఎఫ్, కంపెనీలకు కృతజ్ఞతలు తెలుపుతూ ఎందుకోసం విచ్చేసిన అభ్యర్థులను ముందస్తు శుభాకాంక్షలు తో పాటు ఆల్ ది బెస్ట్ చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ కేబీవీ సుబ్బయ్య మాట్లాడుతూ ఉద్యోగ నిరీక్షణలో విచ్చేసిన ప్రతి ఒక్క విద్యార్థి కచ్చితంగా ఉద్యోగం సాధించాలని అందుకోసం కావలసిన ప్రతిభను కనబరిచి నచ్చిన కంపెనీలను ఎంపిక చేసుకుని వాటిలో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ముందుగా నిరుద్యోగుల కోసం నిర్వహిస్తున్న ఈ ఉద్యోగం వేళలో విద్యార్థులను ఎంపిక చేసుకోవడానికి మా కళాశాల విచ్చేసిన ప్రతి ఒక్క ప్రతినిధిని ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని, ఈ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకొని విచ్చేసిన ప్రతి ఒక్క విద్యార్థికి శుభాకాంక్షలు తెలుపుతూ నంద్యాల మరియు పరిసర ప్రాంతాల నుండి సుమారు 130 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో వివిధ కంపెనీలలో ప్రతిభ కనబరిచి 62 మంది ఉద్యోగాలు సాధించారని వీరు కంపెనీల నియామక ప్రక్రియ ప్రకారము కొన్ని కంపెనీలు వెంటనే ఉద్యోగాలు కల్పిస్తున్నాయని వీరికి కనీస వార్షిక ఆదాయంగా రెండు లక్షల నుండి నాలుగున్నర లక్షల పొందుతారని మరికొన్ని కంపెనీలు తదుపరి ప్రక్రియలో చివరి ఇంటర్వ్యూ హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో నిర్వహించి వారికి నియామక పత్రాలు అందజేస్తాయని తెలిపారు. ఇందుకోసం అభ్యర్థులు తయారవ్వాలని వాటిలోనూ మంచి ప్రతిభ కనబరిచి కచ్చితంగా వారి భవిష్యత్తును నిర్మించుకోవాలని తెలిపారు ఉద్యోగ ప్రక్రియలో ఎంపికైన ప్రతి ఒక్క విద్యార్థికి శుభాకాంక్షలు తెలుపుతూ అర్హత సాధించనీ విద్యార్థులు బాధపడకుండా ఇంకా చాలా అవకాశాలు ముందుగా వస్తాయని అందులో మీ ప్రతిభను బట్టి కచ్చితంగా ఉద్యోగాలు సాధిస్తారని తెలిపారు ఈ ప్రక్రియ నిర్వహించిన కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ లు సంపత్ కుమార్ మరియు ఇంతియాజ్ అహమద్ ను అభినందనలు తెలిపారు. కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎం.ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ నిరుద్యోగ విద్యార్థుల కొరకు ఇంతటి సువర్ణ అవకాశం కల్పించిన కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఇందుకోసం హైదరాబాద్ బెంగళూరు నుండి విచ్చేసిన కంపెనీ ప్రతినిధులను ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ఇందులో అర్హత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో అర్హత సాధించిన వారి వివరాలు తెలుపుతూ ఎన్ఐఐటి కంపెనీలో 12 మంది , పేటీఎం కంపెనీలో 8 మంది, ఎంఆర్ఎఫ్ తెలంగాణ బ్రాంచ్ లో 6 మంది, రీసెల్యూట్ ప్రైవేట్ లిమిటెడ్ లో 8 మంది, ఎంఆర్ఎఫ్ కర్ణాటక బ్రాంచ్ లో ఏడు మంది, జస్ట్ డయల్ లో పదిమంది, ఎల్ మరియు టి కంపెనీలో నలుగురు, టాటా ట్రెండ్ కంపెనీలో పదిమంది, పేటీఎం కంపెనీలో ఏడు మంది ఉద్యోగాలు సాధించారని ఇంతే కాకుండా ఇటువంటి చాలా ఉద్యోగ ప్రక్రియలు కళాశాలలో రెగ్యులర్గా జరుగుతూ ఉంటాయని ప్రతి ఒక్క విద్యార్థి అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

చివరగా కళాశాల యాజమాన్యం ప్రొఫెసర్ జి రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ జి హేమంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ కెబివి సుబ్బయ్య, మరియు అధ్యాపకులు అందరూ కలిసి కళాశాల సాంప్రదాయం ప్రకారము కంపెనీ ప్రజలను ఘనంగా సన్మానించారు.

# ప్రపంచ పశువైద్య దినోత్సవ సందర్భంగా గోవులను రక్షించండి.

**-గోవులను బజార్లలో వదిలిపెట్టే యజమానులపై చర్యలు తీసుకోండి.**



**ఆంధ్ర ప్రగతి డోన్ ఏప్రిల్ 26:**
శనివారం రోజు ప్రపంచ పశువైద్య దినోత్సవ సందర్భంగా పట్టణాలలో ఆవుల యజమానులు వాటిని వదిలిపెట్టి రాత్రికి ఇంటికి వచ్చిన తర్వాత పాలు పిండుకుని జీవనోపాధి చేస్తున్నారు అవి పగలు పూట ప్లాస్టిక్ వ్యర్థాలు చిత్తుకాగితములు ఇతర వ్యర్థ పదార్థాలు అనారోగ్యముతో మరణించుచున్నాయి. వాటిని సంరక్షించాల్సిన మున్సిపల్ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదుగతంలో గ్రామపంచాయతీ వారు బందెల దొడ్డి ఏర్పాటు చేసి విధులలో తిరుగుతున్న పశువులను అక్కడికి తోలి యజమానులకు డబ్బులు వసూలు చేసేవారు అలా చేయడం వలన పశువుల యజమానులు పశువులను బయటికి పంపకుండా జాగ్రత్త చేసుకునేవారు ప్రస్తుతం మున్సిపల్ కౌన్సిల్స్ ఏర్పడిన తర్వాత మున్సిపల్ అధికారులు సిబ్బంది ఎవరూ కూడా పశువులపై శ్రద్ధ చూపడం లేదు అదేవిధంగా ప్రతి ఆవుకు బర్రెకు పాలు పిండడానికి ఇంజక్షన్ ద్వారా ప్రతిరోజు ఇంజక్షన్ ఇచ్చి పాలు పిండుతున్నారు. అలా పాలు పెట్టడం వలన పాలు తాగిన వినియోగదారులు అనారోగ్యానికి గురవుతున్నారు. పశువులు కూడా రోజు సూదిలో వల్ల అనారోగ్యానికి గురవుతున్నాయి వీటిని పశువర్ధక శాఖ వారి సబ్సిడీ ఇచ్చి ఇంజక్షన్లను అందిస్తూ పశువుల యజమానులకు ఇంజక్షన్ల గురించి అవగాహన చేస్తున్నారు అలా అలవాటు పడిన పశువులు ఇంజక్షన్ ఇవ్వకుంటే పాలు ఇవ్వడం లేదు కనుక వెంటనే పశువు యజమానులు ఇంజక్షన్లను వేయకుండా పశువులకు పాలుపిండాలని కుక్కకాటుకు లక్షలాదిమంది బలి అవుతున్నారుఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ వీధి కుక్కలకు కూడా చేసి కుక్కల సంతతిని నిరోధించాలని ఒక కుక్క పది పిల్లలను కని పాలు ఇవ్వలేక చనిపోతున్నాయని ఆ పిల్లలు కూడా పాలు లేకుండా చనిపోతున్నాయని వెంటనే మున్సిపల్ సిబ్బంది పశువర్ధక శాఖ సిబ్బంది కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించి ప్రజలకు కుక్క కార్డు నుండి రక్షణ కల్పించాలని గవర్నమెంట్ హాస్పిటల్ లో కుక్కకాటుకు మందు కూడా సరిగా సరఫరా చేయడం లేదు ఈ విషయాలపై జంతు సంక్షేమ సంఘాలు ప్రజా సంఘాలు సామాజిక సేవా సంఘాలు కూడా తమ వంతుప్రచారాన్ని చేపట్టాలని నంద్యాల జిల్లా ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఏఈ నాగరాజు గౌడ్ పత్రికా విలేకరుల సమావేశంలో తెలియజేశారు ఈ కార్యక్రమంలో డోన్ తాలూకా వినియోగదారుల రక్షణ సంఘం కన్వీనర్ జయ మనోజ్ కుమార్వెల్దుర్తి మండల వినియోగదారుల రక్షణ సంఘం కన్వీనర్ కాల్వ ఓం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# డిపాజిట్లు మరియు వివిధ డిపాజిట్ ఖాతాల గురించి తెలిసిఉండాలి.

**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ ఏప్రిల్ 26:**
నంద్యాల జిల్లా, ఆళ్లగడ్డ పట్టణంలో, 26 ఏప్రిల్ న, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో, సొసైటీ ఫర్ రూరల్ ఎకో డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో, డిపాజిట్టర్ల విద్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు. దామోదర్ రెడ్డి, సిటీ మిషన్ మేనేజర్ జె.రాములు, కే. ఉమాదేవి, టి.ఎల్.ఎఫ్ .ప్రెసిడెంట్. కె ఆర్ లక్ష్మణ్ ఏపీజిబి ,ఎక్స్ బ్యాంకు మేనేజర్, కమ్యూనిటీ ఆర్గనైజర్స్, డి హుస్సేన్ బి, హెచ్ .హిమబిందు, సి విద్యాసాగర్ ,రిసోర్స్ పర్సన్ కొమ్ము పాలెం శ్రీనివాస్ పాల్గొన్నారు. దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ,డిపాజిటర్ల విద్య మరియు అవగాహన కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ,డిపాజిట్ యొక్క అభద్రతలను తొలగించి ,బ్యాంకు వైపు నడిపించడం, పొదుపు ఆవశ్యకతను తెలియజేసి, బ్యాంకుల్లోనే ఎందుకు పొదుపు చేయాలని, తెలియజేయడం. ప్రైవేటు సంస్థల్లో పెట్టి మోసపోవడం, నష్టపోవడం, గ్యారంటీ లేకపోవడం, గతంలో ఎన్నో సంస్థల్లో ఎక్కువ వడ్డీ ఆశతో,
అభియ గోల్డ్, అగ్రిగోల్డ్, బొమ్మరిల్లు ,ఎన్నో ప్రైవేటు సంస్థలు ఖాతాదారులను మోసం చేశాయని ,వాటి నుంచి రక్షణ కల్పించడమే, బ్యాంకుల యొక్క బాధ్యత అని ,బ్యాంకుల్లో డబ్బులు దాచుకోవడం, పొదుపు చేసుకోవడం ,లోన్లు తీసుకోవడం, ఆర్థికంగా ఎదగడం కొరకు మనకు బ్యాంకులో ఎంతో తోడుపాటుగా ఉన్నాయని తెలియజేశారు. ఏ.పీ.ఎం. రాములు ,రిసోర్స్ పర్సన్ కొమ్ము పాలెం శ్రీనివాస్, మాట్లాడుతూ, సేవింగ్ ఖాతా పొదుపులను ప్రోత్సహించడానికి రూపొందించబడినది. ప్రతి ఒక్కరు కచ్చితంగా పొదుపు ఖాతా కలిగి ఉండాలి .మీ డబ్బును ఇంట్లో ఉంచడం వల్ల, ఏ ప్రయోజనం ఉండదు. రోజువారి మిగులుగా సేవింగ్ ఖాతాలో జమ చేయాలి. ఫిక్స్డ్ డిపాజిట్ అకౌంటు., స్థిర కాల వ్యవధిలకు డబ్బులు డిపాజిట్ చేసుకున్నందుకు, బ్యాంకులో అందించే డిపాజిట్ పథకమే, డిపాజిట్ ఎకౌంటు .7 రోజులు నుండి 10 సంవత్సరాల కాల వ్యవధికి, డిపాజిట్ చేయవచ్చు. ఫిక్స్డ్ డిపాజిట్ అకౌంట్స్‌బీ. ఎక్కువ వడ్డీని అందిస్తాయి, సురక్షిత పెట్టుబడి పథకం, ఆర్థిక మార్కెట్ల ఒడిదుడుకులతో సంబంధం ఉండదు. కొన్ని బ్యాంకులు పన్ను లాభాలు కూడా అందిస్తాయి. ఆదాయపు పన్ను, చట్టం ప్రకారం స్థిర



డిపాజిట్లు, టి.డి ఎస్. వడ్డీ పై వర్తిస్తుంది. టీ.డీ.ఎస్. మినహాయింపుకై ఫారం 15 జి, హెచ్, సమర్పించవలసి ఉంటుంది. రికరింగ్ డిపాజిట్ అకౌంట్ బీ.బ్యాంకులో అందించే ప్రత్యేకమైన టర్మ్ డిపాజిట్ పథకమే ,రికరింగ్ డిపాజిట్ అకౌంట్ ,డిపాజిట్ తన రెగ్యులర్ ఆదాయము నుండి ప్రతినెల ఒక నిర్ణీత మొత్తాన్ని ఒక నిర్ణీత కాలానికి డిపాజిట్ చేయవచ్చు. రికరింగ్ డిపాజిట్ అకౌంట్ బీ. 6 నెలల నుండి 10 సంవత్సరాల వరకు ఎంపిక




చేసుకోవచ్చు, నెలకు ?10 నుండి ఎంత మొత్తానైనా డిపాజిట్ చేయవచ్చు, స్టాండింగ్ సూచనల ద్వారా సేవింగ్ కరెంట్ అకౌంట్ నుండి, రికరింగ్ డిపాజిట్ అకౌంటు కు డబ్బు ట్రాన్సఫర్ చేయవచ్చు, ఈ పథకం పొదుపును ఒక సాధారణ అలవాటుగా చేస్తుంది .ఆదాయపు పన్ను చట్టం ప్రకారం, వడ్డీ పై టీ.డీ.ఎస్. వర్తిస్తుంది. కరెంట్ అకౌంట్, బ్యాంకు ఎక్కువ లావాదేవీలు నిర్వహించే వ్యాపార సంస్థలు కంపెనీలు విద్యాసంస్థల కోసం నిర్దేశించిన ఖాతా సాధారణంగా కరెంట్ అకౌంట్ కు వడ్డీ చెల్లించారు .కనీస బ్యాలెన్స్ ఎక్కువ మొత్తంలో ఉండాలి. లావాదేవీలపై ఆంక్షలు ఉండవు. తరచుగా ఎక్కువ లావాదేవీలు చేసుకొనే అవకాశం ఉంటుంది. ఓవర్ డ్రాఫ్టింగ్ సౌకర్యం ఉంటుంది. ఇంటర్నెట్ మొబైల్ బ్యాంకింగ్ సౌకర్యం పొందవచ్చు. ప్రాథమిక పొదుపు ,డిపాజిట్ అకౌంటు ప్రజలందరికీ ఆర్థిక సమీకృతంలో భాగస్తులను చేయుటకు ,రిజర్వ్ బ్యాంక్ వారు అన్ని ప్రభుత్వం మరియు ప్రైవేటు బ్యాంకులను ప్రాథమిక పొదుపు బ్యాంకు డిపాజిట్ ఖాతాలను సులభంగా తెరవాలని ఆదేశించింది. జీరో బ్యాలెన్స్ ఉచిత లావాదేవీలు, ఉచిత నగదు డిపాజిట్లు నిర్దిష్ట పరిమితి వరకు ఉచిత ఉపసంహరణలు బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ ఖాతా లక్షణాలు బ్యాంకింగ్ కు దూరంగా ఉన్న అందరిని బ్యాంకింగ్ లోకి తీసుకురావడమే ప్రధాన ఉద్దేశం అని తెలియజేశారు. వ్యర్థకర్చులు అదనపు ఖర్చులు, పొదుపు వాటి ప్రాముఖ్యత, ఇన్సూరెన్స్, అన్ క్లైమేడ్ డిపాజిట్ ,నాలుగు గ్రూపులకు ఏర్పడి చర్చించి ప్రజెంటేషన్ చేశారు.

# కళారాధన ఉచిత లలిత కళల శిక్షణా శిబిరం

**-23 వ సంవత్సరం "కళా సాధన" పేరిట ఉచిత శిక్షణ శిబిరాలు.**

**-మే 1వ తేదీ నుండి 31 వరకు.**

**-మే 31వ తేదీ శిక్షణ పొందిన వారిచే ముగింపు ఉత్సవంలో ప్రదర్శనలు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 26:** కళారాధన సాంస్కృతిక సంస్థ, నంద్యాల ఆధ్వర్యంలో గత 23 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఉచిత లలిత కళలు,క్రీడల వేసవి శిక్షణ శిబిరం ఈ సంవత్సరం మే ఒకటవ తేదీ నుండి మే 31 వ తేదీ వరకు "కళా సాధన -20 25"పేరిట నంద్యాల కే.ఎన్.ఎం. మున్సిపల్ స్కూల్ ఆవరణలో నిర్వహించడం జరుగుతుంది.ఈ శిక్షణ శిబిరం లో శాస్త్రీయ నృత్యం,ఆధునిక నృత్యం, శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం ,వాద్యసంగీతంలో గిటార్,కీబోర్డ్, మిమిక్రీ, వెంట్రిలాక్విజం, చిత్రలేఖనం, చక్కటి చేతివ్రాత ,హస్తకళలు,ఫ్యాబ్రిక్ పెయింటింగ్,పద్య పఠనం, సంస్కృత శ్లోకాలు, కవితా గానం,కవితా రచన, చదరంగం,కరాటే, టైక్వాండో, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలలో 22 మంది కోచ్ లతో శిక్షణా శిబిరాలు నిర్వహించడం జరుగుతుంది.మే 31 వ తేదీన ముగింపు ఉత్సవం లో శిక్షణ పొందిన బాలబాలికల చేత ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. శిబిరంలో పాల్గొన్న ప్రతి వారికి ప్రశంసా పత్రం అందజేస్తారు. శిబిరంలో శిక్షణ పొందడానికి, ముగింపు ఉత్సవంలో ప్రదర్శనలు ఇవ్వడానికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరంలేదు.

కళారాధన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు ,డాక్టర్ రవి కృష్ణ ,ప్రోగ్రాం కోఆర్డినేటర్ రంగనాథ్ మాట్లాడుతూ వేసవి సెలవులను బాలలు, యువత సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. కళలు, క్రీడలు బాలల మానసిక, వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని తద్వారా చదువులో కూడా రాణించడానికి అవకాశాలు మెరుగవుతాయని అన్నారు.

యువజన విభాగం అధ్యక్షుడు రంగనాథ్, కోచ్ లు కళ్యాణి, లలితా సరస్వతి, సుభాషిని,రజాక్, సుదర్శనం, బాలకృష్ణ, నాగేంద్ర, రాజేంద్ర, శివకుమార్, సతీష్ ,మధు, రాజా ,ఆది, తరుణ్, సీతారాం, రాజ్ కుమార్, సత్యనారాయణ, రామసుబ్బయ్య శిబిరంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇతర వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు:8309735050,9959307424

# గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం పకడ్బందీగా అమలు చేయండి.

**-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 26:** గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంలో నిర్దేశించిన అంశాలను పకడ్బందీగా అమలు చేస్తూ లింగ నిర్ధారణ వెల్లడి నిషేధంపై పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్ లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ, ఎన్టీఆర్ వైద్య సేవ కార్యక్రమాల అమలుపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వెల్లడి నిషేధంపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. నిషేదిత చట్టంలోని నిబంధనల మేరకు స్కాన్ సెంటర్లు లేదా డయాగ్నస్టిక్ సెంటర్లు లింగ నిర్ధారణ చేసినట్లయితే కఠిన చర్యలు తప్పవన్నారు. లింగ నిర్ధారణ కోసం ప్రయత్నించినా లేదా ప్రోత్సహించిన వారిపై కూడా చర్యలు తప్పవన్నారు. ప్రతి ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రులలో ఈ చట్టంపై అవగాహన కోసం ఫ్లెక్సీల బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. కొత్త స్కాన్ సెంటర్స్ తప్పనిసరిగా జిల్లా కమిటీ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రతి 5 సంవత్సరాలకు రెన్యూవల్ నిమిత్తం నెల రోజుల ముందే అప్లై చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రెన్యువల్ కు వచ్చే స్కానింగ్ కేంద్రాలు హైపవర్ మిషన్ వాడాలని లేనిపక్షంలో రెన్యువల్ నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై స్త్రీ శిశు సంక్షేమం, మహిళా సంఘాలు, పోలీస్ వారి సహకారంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో లింగానిర్ధారణ పరీక్షలు జరగకుండా పోలీసు అధికారులతో వైద్యులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు.ఎన్టీఆర్ వైద్య సేవ క్రింద ప్రజలకు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందించకుండా నగదు వసూలు చేసినట్లు 8 ఆసుపత్రుల్లో 33 ఫిర్యాదులు నమోదు అయ్యాయని వారికి నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ డిఎంహెచ్ఓను ఆదేశించారు. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీ కోసం డిఓ లేఖను సిద్ధం చేయాలని కలెక్టర్ డిఎంహెచ్ఓను ఆదేశించారు. చట్ట వ్యతిరేకంగా పరీక్షలు చేసిన వైద్యులుకు మొదటి సారి తప్పుకు 10 వేలు జరిమానా, 3 సంవత్సరాల జైలు శిక్ష, రెండవ సారి తప్పు చేస్తే 50వేలు, 5 సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందన్నారు. మూడవ సారి అదే తప్పు చేస్తే వైద్యుల పేర్లు కౌన్సిల్ నుండి పేరు తొలగించడం జరుగుతుందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలకు ప్రోత్సహించే వారికీ 3 సంవత్సరాల జైలు మరియు 50 వేలు జరిమానా, రెండవ ధపాకు 5 సంవత్సరాలు జైలు మరియు లక్ష రూపాయలు జరిమానా విధించబడుననే అంశాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ స్కానింగ్ కేంద్రాల దరఖాస్తులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఎం అండ్ హెచ్ ఓ వెంకటరమణ, సిఐ సూర్య మౌళి, మదర్ సొసైటీ ఎన్జీవో రామారావు, ఇంచార్జ్ డిసిహెచ్ఎస్ డా. ఓ. లలిత, ఎన్టీఆర్ వేద సేవ కోఆర్డినేటర్ డా. రూపేంద్ర నాథ్ రెడ్డి, ఇంచార్జ్ డెమో కె రవీంద్ర నాయక్, జిల్లా మానిటరింగ్ అధికారి సుమలత, వంశీ పాల్గొన్నారు.

# శ్రీశైల క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటకరంగ అభివృద్ధికి నివేదికలు ఇవ్వండి.

**-శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయండి.-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్, 26 :** శ్రీశైల మహా క్షేత్రాన్ని, క్షేత్ర పరిసరాలను ఆధ్యాత్మికంగా, పర్యాటకపరంగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నామని అందుకు అవసరమయ్యే డాక్యుమెంట్లు, సర్వే నంబర్ల వారీగా విస్తీర్ణ వివరాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శ్రీశైలం క్షేత్ర అభివృద్ధిపై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ తో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో డిఆర్ఓ రాము నాయక్, డీఎఫ్ఓ సాయిబాబా, శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు, ఆత్మకూరు ఆర్డీఓ అరుణజ్యోతి, ఇరిగేషన్ ఎస్ఈ శివప్రసాద్ రెడ్డి, జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణమూర్తి, ఏపీటీడీసీ డివిఎం లక్ష్మీనారాయణ సంబధిత అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ శ్రీశైల దివ్య క్షేత్రంతోపాటు చుట్టుపక్కల ఉన్న పరిసర ప్రాంతాలను ఆధ్యాత్మికంగా, పర్యాటకపరంగా, అహ్లాదకరంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని ఇందుకు అవసరమయ్యే డాక్యుమెంట్లు, సర్వే నంబర్ల వారీగా విస్తీర్ణ వివరాలు ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శ్రీశైలానికి వచ్చే భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం మూడు రోజులపాటు శ్రీశైలం ప్రాంతంలోనే ఉండి పరిసర ప్రాంతాలలో ఉన్న ప్రకృతి అందాలను దర్శించేందుకు వీలుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. శ్రీశైలం వచ్చే భక్తుల సౌకర్యార్థం వసతి, క్యూలైన్స్, రవాణా, పార్కింగ్ ఇతర మౌలిక సదుపాయాలు తదితర 9 రకాల కాన్సెప్ట్ లతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే సున్నిపెంట ప్రాంతంలో గుర్తించిన 178 ఎకరాల రెవెన్యూ భూముల్లో 50 ఎకరాలు పర్యాటక శాఖకు కేటాయించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. గతంలో ఇరిగేషన్ కు సంబంధించిన 1468.52 ఎకరాల ఇరిగేషన్ భూముల్లో 719 ఎకరాలు వివిధ శాఖలకు కేటాయించడం జరిగిందన్నారు.

# మైనారిటీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత.

**-ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం.**

**-మైనారిటీల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన గత ప్రభుత్వం.**

**-రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**

**-ఓబిఎంఎంఎస్ వెబ్ సైట్ ను ప్రారంభించిన మంత్రి ఎన్ ఎండి ఫరూక్.**




**ఆంధ్ర ప్రదేశ్ అమరావతి ఏప్రిల్ 26 ఆంధ్ర ప్రగతి:** రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నదని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలోని మూడవ బ్లాక్ సమావేశపు భవనంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మైనారిటీల స్వయం ఉపాధి కోసం రాయితీతో కూడిన బ్యాంకు రుణాల మంజూరు ప్రక్రియకు సంబంధించి ఆన్లైన్ బెనిఫిషియరీ మేనేజ్మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టం( ఓబిఎంఎంఎస్ ) వెబ్ సైట్ ను మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ తో కలిసి మంత్రి ఫరూక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి నేటి వరకు, దివంగత ముఖ్యమంత్రి ఎన్ టి రామారావు, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రుల సారధ్యంలో రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమానికి కృషి చేయడం జరిగిందన్నారు. వేలాది మసీదులు, దర్గాలు, కబరస్థాన్లు, చర్చిలు తదితర మైనారిటీ ప్రాధాన్యత నిర్మాణాలకు కోట్లాది రూపాయలను ఖర్చు చేసిన ఘనత తమదేనని పేర్కొన్నారు.గతంలో తమ ప్రభుత్వం మంజూరు చేసిన మైనారిటీ సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను పూర్తి చేయకుండా ఐదేళ్ల గత ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్య ధోరణితో మైనారిటీలను చిన్నచూపు చూసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాము ఇచ్చిన హామీల మేరకు మైనారిటీల సంక్షేమానికి ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా కార్యాచరణతో కూడిన చర్యలను చేపట్టడం జరిగిందని మంత్రి అన్నారు. రాష్ట్రంలోని ఇమాములు, మౌజన్లు, పాస్టర్లకు పెండింగ్లో ఉన్న గౌరవ వేతనం చెల్లింపులను కూటమి ప్రభుత్వం మంజూరు చేసి వారి వారి బ్యాంకు ఖాతాల్లో ఆన్లైన్ ద్వారా నేరుగా జమ చేసినామని, మైనార్టీల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగా చూసిందే తప్ప, వారి సంక్షేమం కోసం పైసా విదిల్చలేదని మంత్రి ధ్వజమెత్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మైనార్టీల స్వయం ఉపాధి కోసం రాయితీతో కూడిన బ్యాంకు రుణాలను కూటమి ప్రభుత్వం అందిస్తున్నదని పేర్కొన్నారు. ఇందుకోసం బడ్జెట్లో రూ. 169.50 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, ఇన్దుకు దాదాపు సమానంగా రూ. 173.02 కోర్టు బ్యాంకులు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని, మొత్తం రూ.342.52 కోట్లు అర్హులైన మైనారిటీల స్వయం ఉపాధికి ఖర్చు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణ మరియు ఉపాధి కోసం అదనంగా మరో రూ. 24 కోట్లు మంజూరు చేయడం జరిగింది అన్నారు. అర్హులైన వారంతా ఆర్థిక అభివృద్ధి సాధన కోసం ఉపాధి రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు.

# ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 26:** కాశ్మీర్లో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా ఉగ్రవాదుల దిష్టిబొమ్మను నంద్యాల ప్రధాన సెంటర్లో దాహనం చేసిన ఎమ్మార్పీఎస్ మరియు మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులుమాన్య మందకృష్ణ మాది ఆదేశాలు మేరకు కాశ్మీర్ రాష్ట్రంలో జరిగిన ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన భరతమాత ముద్దుబిడ్డలకు ఆత్మ శాంతి చేకూరాలని నివాళ్ళు అర్పిస్తూ మరియు ఆ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను నంద్యాలలో దాహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ అత్యంత దారుణంగా ,పాసవికంగా భరతమాత బిడ్డలైన టూరిస్టులను చంపడం అనేది పిరికిపంద చర్యని ...దీనిని భారత దేశ ప్రజలు చేస్తూ ఊరుకోరని ఈ తీవ్రవాదాన్ని కూకటి వేళ్ళతో సహా అణిచివేయాలని, ప్రధాన నరేంద్ర మోడీ ని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ తరఫున కోరుకుంటున్నాట్లు ,ఎమ్మార్పీఎస్ ఎంఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. అమరులైన బాధిత కుటుంబాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉండాలని ఈ సందర్భంగా కోరారు .ఇలాంటి చర్యలు ఇకముందు జరగకుండా అత్యంత కఠినమైన చర్యలు చట్ట ప్రకారం తీసుకోవాలని కోరారు .ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటుగా ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బాయికాటి బెనర్జీ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము చంటి మాదిగ, ఎంఎస్పి నంద్యాల టౌన్ నాయకులు రాము మాదిగ, శీను మాదిగ మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజలకు పోలీసులు అండగా ఉంటారనే భరోసా కల్పించేందుకు కార్డెన్ సర్చ్.

**-చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ ఏప్రిల్ 26:** నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి జావళి ఆల్ఫోన్స్ సూచనలతో నంద్యాల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆత్మకూరు బస్టాండ్, చెరువుకట్ట ప్రాంతాలలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అనుమానితుల ఇల్లు, అనుమానిత వ్యక్తులు, రౌడీ షీటర్లు నేరచరిత్ర గల వారి ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం అనుమానితులు, నేరచరిత్ర గలవారు, రౌడీషీటర్లు ఏదైనా నేరాలలో పాల్గొంటున్నారని అనుమానంతో వారి వేలిముద్రలను మొబైల్ సిస్టం చెక్ డివైస్ ద్వారా పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా శాంతిభద్రతలకు భంగం కలిగించిన, నేరాలలో పాల్గొన్న ,చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో అనగా గంజాయి, అక్రమ మద్యం, నాటుసారా, మట్కా, జూదం మొదలగు వాటికి సంబంధించిన కార్యకలాపాలలో పాల్గొంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, 2 టౌన్ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్, సబ్ ఇన్స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉగ్రవాదుల దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ నాయకులు కొవ్వొత్తులతో నిరసన.



**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు ఏప్రిల్ 26:** జమ్ము కాశ్మీర్లో ప హల్గాం లో టూరిస్టుల పైన ఉగ్రవాదులు దాడి చేయడం జరిగింది అందుకు నిరసనగా నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మండలం కొత్త రామాపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొవ్వొత్తులతో నిరసన తెలియజేసి ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని నినాదాలు తీశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అండ్ ఎం ఎస్ పి జిల్లా అధికార ప్రతినిధి బాషాపోగుల. దరగయ్య మాదిగ జిల్లా నాయకులు ఎస్ దేవసాయం మాదిగ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బి చిన్న వెంకటరమణ ఆత్మకూరు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు వనమాల పుల్లయ్య, టౌన్ అధ్యక్షులు చిలుక నాని, మండల ప్రధాన కార్యదర్శి వై ముంతన్న మండల నాయకులు పెద్ద పుల్లయ్య చిన్న పుల్లయ్య స్వాములు, రంగస్వామి కొత్త రామపురం రంగస్వామి, పెదనంతాపురం గ్రామ నాయకులు వెంకట శేషు, బాలరాజు, కొత్తరాపురం ఎమ్మార్పీఎస్ గ్రామ నాయకులు భాస్కర్ ప్రతాప్, శీను, సోపెన్న, గ్రామంలో ఉన్న మాదిగ అందరూ పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు, టెంట్లు ప్రభుత్వం మంజూరు చేయాలి.

**-ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం**



**ఆంధ్ర ప్రగతి బండి ఆత్మకూరు ఏప్రిల్ 26:** మండలంలోని పెద్ద దేవలాపురం లో ఉపాధి కూలీల పని దగ్గర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవిడ్ లు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి 20 నుండి ఏప్రిల్ 24 తారీకు వరకు 9 వారాల బిల్లులు ఇవ్వాలి, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 11 నుండి 14 వరకు పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, జిల్లా వ్యాప్తంగా జీపు జాత ద్వారా ఉపాధి కూలీల దగ్గరికి వెళ్లి వారి స్థితిగతులు తెలుసుకొని ఏప్రిల్ 15 కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా చేయడం వలన మూడు వారాలు కూలి వేయడం చాలా అన్యాయం అన్నారు. ఇప్పటికైనా పెండింగ్ లో ఉన్నటువంటి 9 వారాల బిల్లులు వెంటనే ఇవ్వాలని, ఉపాధి హామీ పని ప్రదేశాలలో మౌలిక వసతులు కల్పించాలని, పనిముట్లు ఇవ్వాలని, మేటీలకు తక్షణమే పారితోషం ఇవ్వాలని, పని ప్రదేశాల్లో ప్రమాద శాతం మరణించిన ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వమే భీమా సౌకర్యం కల్పించి మరణించిన ప్రతికూలికి రూ.25 లక్షలు, ఎక్సిగేషన్ ఇవ్వాలి, ఐదు కిలోమీటర్ల దాటితే ప్రయాణ ఖర్చులు ఇవ్వాలి, రెండు పూటల ఫోటో రద్దు చేయాలి, వార వారం కొలతలు కొలిచి ప్లేస్ లు ఇవ్వాలి, 15 రోజులకు ఒకసారి బిల్లులు ఇవ్వాలి, కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలి అన్ని గ్రామాల్లో ఉపాధి పని కల్పించాలి ఉపాధి హామీ అధికారులు పని ప్రదేశాలు వెళ్లి తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు.

# వరుణుడిదే విజయం

**పంజాబ్ 201/4 -ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ అర్ధసెంచరీలు**

**కోల్‌కతా ఇన్నింగ్స్‌కు వర్షం అంతరాయం -మ్యాచ్ రద్దు.. ఇరు జట్లకు చెరో పాయింట్**





కోల్‌కతా: తాజా ఐపీఎల్‌లో తొలిసారి ఓ మ్యాచ్ వర్షార్పణమైంది. శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్-పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్‌కు వరుణుడు అడ్డు తగిలాడు. అయితే మొదట పంజాబ్ ఇన్నింగ్స్ సజావుగానే సాగింది. కానీ ఆ తర్వాత భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన కోల్‌కతా కేవలం ఒక ఓవర్ మాత్రమే ఆడగలిగింది. ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం ఆరంభం కావడంతో ఇరు జట్ల ఆటగాళ్లు పెవిలియన్‌కు చేరారు. వెంటనే పూర్తి మైదానాన్ని కవర్లతో కప్పి ఉంచినా వర్షం మాత్రం తెరిపినివ్వలేదు. గంటన్నర వేచి చూసినా పరిస్థితుల్లో మార్పు లేకపోవడంతో రాత్రి 11 గంటలకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. దీంతో ఇరుజట్లకు చెరో పాయింట్ లభించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 201 పరుగులు చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (49 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 83), ప్రియాన్ష్ ఆర్య (35 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 69) మెరుపు అర్ధసెంచరీలు సాధించగా.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (25 నాటౌట్) ఫర్వాలేదనిపించాడు. వైభవ్ అరోరాకు 2 వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనలో మ్యాచ్ ఆగే సమయానికి నైట్‌రైడర్స్ ఒక ఓవర్‌లో వికెట్ కోల్పోకుండా ఏడు పరుగులు సాధించింది.

%ఓపెనర్లు అదుర్స్: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్‌కు ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ ఆర్య అదిరే ఆరంభాన్నిచ్చారు. కెప్టెన్ నిర్ణయాన్ని వమ్ము చేయకుండా ఇన్నింగ్స్‌ను కదం తొక్కించారు. చక్కటి సమన్వయంతో పాటు ఇద్దరూ పోటాపోటీ బౌండరీలతో చెలరేగారు. అయితే 15 ఓవర్లలోనే 161 స్కోరుతో ఉన్న వేళ పంజాబ్ స్కోరు సులువుగా 220కి చేరుతుందనిపించింది. కానీ డెత్ ఓవర్లలో కోల్‌కతా పేసర్లు కట్టడి చేశారు. దీంతో జట్టు కష్టంగా 200 దాటగలిగింది. అంతకుముందు ప్రియాన్ష్ తొలి బంతినే ఫోర్‌గా మలిచి తన ఉద్దేశాన్ని చాటుకున్నాడు. నాలుగో ఓవర్‌లో ఆర్య 4,4.. ఐదో ఓవర్‌లో ప్రభ్ 4,6తో పవర్‌ప్లేలో జట్టు 56 రన్స్ సాధించింది. అలాగే హర్షిత్ ఓవర్‌లో ఆర్య వరుసగా 4,6,4తో 27 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేశాడు. ఇక 11వ ఓవర్‌లో ప్రభ్ రెండు సిక్సర్లు, ఆర్య ఓ సిక్సర్‌తో స్పిన్నర్ నరైన్ 22 పరుగులిచ్చుకున్నాడు. ఓవర్‌కు 10 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళుతున్న ఈ జోడీకి రస్సెల్ చెక్ పెట్టాడు. 12వ ఓవర్‌లో ప్రియాన్ష్‌ను అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆర్య నిష్క్రమించాక ప్రభ్‌సిమ్రన్ బ్యాట్ ఝుళిపించాడు. 13వ ఓవర్‌లోనే 4,4,6తో హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. స్పిన్నర్ వరుణ్ ఓవర్‌లో ప్రభ్ 4,4,6,4 బాదడంతో 19 పరుగులు వచ్చాయి. అయితే సెంచరీ ఖాయమనుకున్న వేళ పేసర్ వైభవ్ విసిరిన లో ఫుల్‌టాసకు ప్రభ్ క్యాచ్ అవుటయ్యాడు. అయితే అప్పటికి ఓవర్‌కు 11 పరుగుల రన్‌రేట్‌తో పంజాబ్ దూసుకెళుతోంది. కానీ రస్సెల్, వైభవ్ డెత్ ఓవర్లలో కట్టడి చేశారు. ఈ సమయంలో మ్యాక్స్‌వెల్ (7), జాన్సెన్ (3) వికెట్లను సైతం కోల్పోయిన పంజాబ్ ఆఖరి ఆరు ఓవర్లలో చేసింది 43 పరుగులే. ఇక, శ్రేయాస్ క్రీజులోనే ఉన్నా భారీ షాట్లు ఆడలేకపోయాడు

## కిశోర్ కు మంచి భవిష్యత్ ఉంది

**ఎస్ఆర్‌హెచ్ హెడ్ కోచ్ డేనియల్ వెట్టోరి**



ఐపీఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పేలవ ప్రదర్శన చేస్తూ అభిమానులను నిరాశపరుస్తోంది. ఇప్పటివరకు ఆడిన 9 మ్యాచుల్లో ఆరింటిలో ఓడి పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో నిలిచింది. అయితే తాజాగా చెపాక్ స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచులో విజయం సాధించి ప్లే ఆఫ్స్ ఆశల్ని సజీవం చేసుకుంది. అయితే మ్యాచ్ అనంతరం ఎస్ఆర్‌హెచ్ హెడ్ కోచ్ డేనియల్ వెట్టోరి కీలక వ్యాఖ్యలు చేశారు. తమ జట్టు.. మెగా వేలంలో ఓ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ ను దక్కించుకునేందుకు తీవ్రంగా పోటీ పడిందని, కానీ కొనుగోలు చేయలేక పోయిందని చెప్పాడు.గుజరాత్ టైటాన్స్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ రవిశ్రీనివాసన్ సాయి కిశోర్ ప్రదర్శన తనను బాగా ఆకట్టుకుందని తెలిపాడు హెడ్ కోచ్ డేనియల్ వెట్టోరి. "కిశోర్ కు మంచి భవిష్యత్ ఉంది. అతడు అద్భుతంగా ఆడుతున్నాడు. ముంబై జట్టులో మిచెల్ శాంట్నర్, పంజాబ్ కింగ్స్ తరఫున హర్‌ప్రీత్ బ్రార్ మంచిగా ఆడుతున్నారు. ఇక సాయి కిశోర్ అద్భుతం. మెగా వేలంలో అతడిని కొనుగోలు చేసేందుకు బాగా ప్రయత్నించాం. చాలా దగ్గరి వరకు వెళ్లాం. అతడు మా జట్టులో ఉండాలని కోరుకున్నాం. పరిమిత ఓవర్ల క్రికెట్ లో మంచి బౌలర్‌కు కావాల్సిన అన్ని లక్షణాలు ఆయనలో ఉన్నాయి. అతడు చాలా ధైర్యంగా ఆడతాడు. బంతిని బాగా తిప్పగలిగే సామర్థ్యం ఉంది. పేస్ మార్చగలిగే సామర్థ్యం ఉంది. ఇతడు ఆడే విధానం.. ఇతర స్పిన్నర్లుకు ఓ టెంప్లెట్ సెట్ చేస్తుంది. పోటీ పడి మరీ ఎలా విజయం సాధించొచ్చో అతడు చూపించగలడు. మంచి బ్యాటింగ్ పిచ్‌లపై కూడా అతడు మంచి ప్రదర్శన చేశాడు," అని వెట్టోరీ పేర్కొన్నాడు.ఏప్రిల్ 6న గుజరాత్ టైటాన్ వర్సెస్ హైదరాబాద్ జట్టు మధ్య జరిగిన మ్యాచులో కిశోర్.. నితీశ్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్ వికెట్లు తీశాడు. తన నాలుగు ఓవర్ల కోటాలో 24 పరుగులే ఇచ్చాడు. దీని గురించి వెట్టోరీ మాట్లాడుతూ.. "అతడు హైదరాబాద్ కు వచ్చి మా జట్టుపై అద్భుతంగా, అసాధారమైన బౌలింగ్ చేశాడు. అతడు అద్భుతంగా రాణిస్తున్నాడని నేను అనుకుంటున్నాను." అని వెట్టోరి అన్నాడు. కాగా, వేలంలో గుజరాత్ టైటాన్స్.. రైట్ టు మ్యాచ్ కార్డ్ ఉపయోగించి కిశోర్ ను రూ.2 కోట్లకు దక్కించుకుంది.

.......

## ఐపీఎల్‌లో 300 పరుగులు సాధించవచ్చు

**కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటర్ రింకూ సింగ్**



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 44వ మ్యాచ్‌కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ డాషింగ్ బ్యాటర్ రింకూ సింగ్ ఓ కీలక ప్రకటన చేశాడు. ఐపీఎల్‌లో 300 పరుగులు సాధించవచ్చని ఈ స్టార్ ఆటగాడు చెప్పుకొచ్చాడు. ఇది కాకుండా రింకూ సింగ్ తన బ్యాటింగ్ స్థానం గురించి కూడా వెల్లడించాడు. జియో హాట్‌స్టార్‌తో జరిగిన ప్రత్యేక సంభాషణలో జెన్ బోల్డ్ స్టార్ రింకూ సింగ్ ఫినిషర్‌గా తన పాత్ర గురించి మాట్లాడాడు. రింకూ సింగ్ ఎంఎస్ ధోని నుంచి నేర్చుకున్న దాని గురించి కూడా చెప్పుకొచ్చాడు.తాను సాధారణంగా 5 లేదా 6వ స్థానంలో బ్యాటింగ్ చేస్తానని చెప్పాడు. దానికి అలవాటుపడినట్లు రింకూ సింగ్ చెప్పుకొచ్చాడు. తాను ఫిట్‌నెస్‌పై చాలా శ్రద్ధ చూపుతానని తెలిపాడు. ఎందుకంటే ఐపీఎల్‌లో 14 మ్యాచ్ లు ఉన్నాయని.. ఈ క్రమంలోని శరీరాన్ని కాపాడుకోవడం, బాగా కోలుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నాడు. మహీ భాయ్ తో తరచుగా మాట్లాడుతుంటానని.. ధోని ప్రశాంతంగా ఉండి మ్యాచ్ పరిస్థితికి అనుగుణంగా ఆడమని చెబుతాడన్నాడు. ఆండ్రీ రస్సెల్ వంటి సీనియర్ ఆటగాళ్ల నుంచి నేర్చుకోవడం ద్వారా బ్యాటర్ గా తాను ఎలా అభివృద్ధి చెందుతున్నానో కూడా రింకూ సింగ్ చెప్పుకొచ్చాడు. రింకూ సింగ్ జట్టు 300 పరుగుల మార్కును దాటే అవకాశాలు కూడా ఉన్నాయని అన్నాడు. ఐపీఎల్ ఎలా అభివృద్ధి చెందిందో చెప్పడానికి గత విజయవంతమైన ఛేజింగ్‌లను రుజువుగా పేర్కొన్నాడు. ఐపీఎల్‌లో ఆడటం మొదలుపెట్టినప్పటి నుంచి రస్సెల్ ను చూసి నేర్చుకుంటున్నానని.. అతడిని దగ్గరగా గమనిస్తానని చెప్పాడు. ముఖ్యంగా చివరి ఓవర్లో రస్సెల్ ఎలా బ్యాటింగ్ చేస్తాడో, శక్తిని ఉత్పత్తి చేయడానికి తన శరీరాన్ని ఎలా ఉపయోగిస్తాడో చూసి నేర్చుకున్నానని చెప్పాడు. ఐపీఎల్ 300 పరుగులు కూడా సాధ్యమయ్యే స్థాయికి చేరుకుందన్నాడు. గత ఏడాది పంజాబ్ 262 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిందని చెప్పాడు. ఈ సీజన్‌లో అన్ని జట్లు బలంగా ఉన్నాయని.. ఎవరైనా 300 పరుగులు చేరుకోవచ్చని చెప్పాడు. ఐపీఎల్ 2025 సీజన్ లో భాగంగా 44వ మ్యాచ్ లో కేకేఆర్ పంజాబ్ కింగ్స్ తో తలపడుతోంది. ఈ రోజు(ఏప్రిల్ 26) కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో పంజాబ్ కింగ్స్ ఇప్పటివరకు గొప్ప ఫామ్ లో ఉంది. అదే సమయంలో అజింక్య రహానే కెప్టెన్సీలోని కేకేఆర్ గత కొన్ని మ్యాచ్‌లలో ఓటమిని చవిచూసింది.

## 'మాడ్రిడ్'లో జొకోవిచ్‌కు షాక్



మాడ్రిడ్: కెరీర్‌లో 100వ టైటిల్‌పై గురిపెట్టిన టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిచ్‌కు మాడ్రిడ్ ఓపెన్‌లో చుక్కెదురైంది. ఈ సెర్బియా యోధుడు అనూహ్యంగా ఆరంభ రౌండ్లోనే కంగుతిన్నాడు. ఇటలీకి చెందిన 44వ ర్యాంకర్ మ్యాటో అర్నాల్డి 5-3, 6-4తో 4వ సీడ్ జొకోవిచ్‌కు షాకిచ్చి సంచలనం సృష్టించాడు. ఇటీవలి కాలంలో వరుసగా విఫలమవుతున్న 37 ఏళ్ల జొకోవిచ్.. ఆరంభ మ్యాచ్‌లో ఓడడం గత ఐదు ఈవెంట్లలో అతనికిది నాలుగోసారి కావడం గమనార్హం.

## ఎలైట్ లిస్ట్‌లో రోహిత్, విరాట్ సరసన ధోనీ



చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ బ్యాటర్ మహేంద్రసింగ్ ధోనీ మరో అరుదైన ఘతన సాధించాడు. ఇప్పటికే కెరీర్‌లో అనేక రికార్డులు సృష్టించి ధోనీ తాజాగా మరో మైలురాయి అందుకున్నాడు. శుక్రవారం చెపాక్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో బరిలోకి దిగిన మహీ ఎలైట్ లిస్ట్‌లో తన పేరు లిఖించుకున్నాడు. ధోనీ తన కెరీర్‌లో 400వ టీ20 మ్యాచ్ ఆడుతున్నాడు. సన్‌రైజర్స్‌తో పోరుతో ధోనీ టీ20ల్లో 400 మ్యాచ్‌ల్లో బరిలో దిగిన ఘనత సాధించాడు. ఈ క్రమంలోనే పొట్టి ఫార్మాట్లో ఈ మైలురాయి అందుకున్న నాలుగో భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఈ లిస్ట్‌లో టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ అత్యధికంగా 456 మ్యాచ్‌లతో టాప్‌లో కొనసాగుతున్నాడు. కాగా, 2006లో సౌతాఫ్రికా మ్యాచ్‌తో టీ20ల్లో అరంగేట్రం చేశాడు. ఆ తర్వాత ఏడాదే భారత్‌కు టీ20 వరల్డ్‌కప్ అందిచిన భారత తొలి కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు. అంతేకాకుండా ఐపీఎల్‌లో చెన్నైకు కెప్టెన్‌గా వ్యవహరించిన ధోనీ ఐదుసార్లు (2010, 2011, 2018, 2021, 2023) ఛాంపియన్‌గా నిలిపాడు. అంతర్జాతీయ టీ20ల్లో 98 మ్యాచ్‌లు ఆడిన ధోనీ 1617 పరుగులు చేశారు. ఇక ఐపీఎల్ కెరీర్‌లో 273 మ్యాచ్‌లు పూర్తి చేసుకన్నాడు. ఇందులో 137.67 స్ట్రైక్ రేట్‌తో 5383 పరుగులు చేశాడు. ఇందులో 24 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇక మ్యాచ్ విషయానికొస్తే, సన్‌రైజర్స్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. చెన్నై నిర్దేశించిన 155 పరుగుల టార్గెట్‌ను ఎస్ఆర్‌హెచ్ 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇషాన్ కిషన్ (44), కమిందు మెండీస్ (32), అనికేత్ వర్మ (19), నితీశ్ కెడ్డి (19) రాణించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన చెన్నై 19.5 ఓవర్లలో 154 పరుగులకు ఆలౌటైంది. హర్షల్ పటేల్ 4 వికెట్లతో సత్తా చాటాడు. కమిన్స్, ఉనాద్కత్‌తు చెరో 2, షమీ, మెండీస్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు.

## రెండో స్థానంలో ప్రజ్ఞానంద



వార్సా: గ్రాండ్ చెస్ టూర్ పోలెండ్ అంచె..ర్యాపిడ్ రౌండ్‌లో భాగంగా తొలిరోజు మూడు రౌండ్లు ముగిసే సరికే భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద (4) సంయు క్తంగా రెండో స్థానంలో నిలిచాడు. మొత్తం 10 మంది తలపడుతున్న ఈ టోర్నీలో శనివారం తొలి రౌండ్‌లో లగ్రావ్‌పై, రెండో గేమ్‌లో సహచరుడు అరవింద్ చిదంబరంపై గెలిచిన ప్రజ్ఞానంద..మూడో రౌండ్‌లో డానియల్ చేతిలో ఓడాడు. అరవింద్ చిదంబరం (3) సంయుక్తంగా నాలుగో స్థానంలో ఉన్నాడు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌కు
## నామినేట్ అయిన కిరణ్ అబ్బవరం సినిమా




నటుడు కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'క', దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌కు నామినేట్ అయింది. ఉత్తమ చిత్రం విభాగంలో ఈ చిత్రం నామినేట్ అయినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ నెలాఖరున ఢిల్లీలో జరగనున్న వేడుకల్లో విజేతలకు పురస్కారాలను అందజేయనున్నారు.గత ఏడాది అక్టోబర్ 31న విడుదలైన 'క' చిత్రం, చిన్న సినిమాగా విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. సుజీత్, సందీప్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నయన్ సారిక కథానాయికగా నటించారు. కిరణ్ అబ్బవరం సొంత బ్యానర్‌పై వచ్చిన ఈ చిత్రాన్ని చింతా గోపాలకృష్ణ నిర్మించారు. ఈ చిత్రం, కిరణ్ అబ్బవరం కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది



## వైష్ణవి చైతన్య న్యూ ట్రెండ్..
# స్లిమ్ అండ్ స్టైలిష్!

యూట్యూబ్ వెబ్ సిరీస్‌ల నుంచి సినీ ఇండస్ట్రీ వరకు వైష్ణవి చైతన్య తనదైన గుర్తింపు సంపాదించుకుంది. తొలి దశలో చిన్న పాత్రలతో ప్రయాణం మొదలుపెట్టిన ఈ బ్యూటీ, "బేబి" సినిమా సక్సెస్‌తో యువతలో క్రేజ్ ను సంపాదించుకుంది. చిన్న వయసులోనే మంచి నటనతో పాటు స్టైలిష్ ప్రెజెన్స్ చూపిస్తూ సోషల్ మీడియాలో భారీ ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసుకుంది. ఇటీవల వైష్ణవి తన కొత్త ఫోటోషూట్ ను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసింది. బ్రౌన్ కలర్ ఫిటెడ్ గౌన్ ధరించిన ఆమె లుక్ ఫ్యాన్స్ ను కట్టిపడేసింది. సింపుల్ అయినా కూడా క్లాస్ టచ్ ఉన్న ఈ డ్రెస్‌తో వైష్ణవి అందాన్ని మరింత హైలైట్ చేసింది. పొడవైన జుట్టుతో స్టైలిష్ హేయర్ డిజైన్, మేకప్ లుక్ ఈ ఫోటోలకు స్పెషల్ టచ్ ఇచ్చాయి. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ ఫోటోల్లో వైష్ణవి క్యాజువల్ పోస్టులే కాకుండా తనలో ఉన్న కాన్ఫిడెన్స్ ను కూడా చూపించింది. సాధారణమైన స్టూడియో బ్యాక్‌డ్రాప్ లో షూట్ చేసినా, లైట్ మరియు షేడో ప్లే వలన ఫోటోలకు కొత్త లుక్ వచ్చింది. ఆమె పోజింగ్ స్టైల్ చూసి ఫ్యాన్స్ "నెక్స్ట్ లెవెల్ స్టార్" అంటూ కామెంట్స్ చేస్తున్నారు. వైష్ణవి కెరీర్ పరంగా కూడా నెక్స్ట్ స్టేజ్ కి వెళ్లే ప్రయత్నాలు చేస్తోంది. కొత్త సినిమాలు, వెబ్ సిరీస్ అవకాశాలు వరుసగా వస్తున్నాయి. ఆమె కెరీర్ లో "బేబి" తర్వాత భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. గ్లామర్ మిక్స్ చేసిన క్యారెక్టర్‌లకు కూడా సిద్ధమవుతూ, ఓల్డ్ స్కూల్ నుండి మోడర్న్ స్టైల్ లోకి మారుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇక ఈ తాజా ఫోటోషూట్ చూస్తే, వైష్ణవి నటన మాత్రమే కాదు, ఫ్యాషన్ ప్రపంచంలోనూ తనదైన స్టైల్ సెట్ చేసుకుంటోంది అనిపిస్తోంది.





## యానిమల్ బ్యూటీ అప్పుడే
# బోర్ కొట్టేసిందా..?

ఏడెనిమిది ఏళ్ల క్రితం మామ్, పోస్టర్ బోయ్స్ సినిమాలతో తెరంగేట్రం చేసింది బాలీవుడ్ భామ త్రిప్తి డిమ్రి. కెరీర్ లో తనకు వచ్చిన అవకాశాలు చేస్తూ వచ్చింది. ఐతే ఎప్పుడైతే యానిమల్ సినిమా వచ్చిందో ఆ సినిమాతో అమ్మడి ఫేట్ మారిపోయింది. అంతకుముందు త్రిప్తిని గుర్తు పట్టని వారు కూడా త్రిప్తి కనిపిస్తే చాలు ఫోటోల కోసం ఎగబడుతున్నారు. యానిమల్ సినిమా ఇచ్చిన ఐడెంటిటీ అంతా ఇంతా కాదు అంటూ త్రిప్తి చాలా ఇంటర్వ్యూస్ లో చెప్పుకొచ్చింది. యానిమల్ క్రేజ్ తో త్రిప్తికి బాలీవుడ్ లో మరికొన్ని ఛాన్స్ లు వచ్చాయి. ఈ రెడేళ్లలో అమ్మడు హిందీలో నాలుగైదు సినిమాలు చేసింది. యానిమల్ సినిమాలో జోయా పాత్రలో త్రిప్తి ఆడియన్స్ ని మంత్రి ముగ్దుల్ని చేసింది. ఆ క్రేజ్ తో కొన్నేళ్ల పాటు బాలీవుడ్ లో తన హవా కొనసాగిస్తుందని అనుకున్నారు కానీ మూడు నాలుగు సినిమాలకే అమ్మడి పని అయిపోయింది. లాస్ట్ ఇయర్ త్రిప్తి బ్యాడ్ న్యూజ్, విక్కీ విద్యా కా ఓ వాలా వీడియో, భూమ్ భూలియా 3 సినిమాల్లో నటించింది. ఈ సినిమాల్లో కూడా త్రిప్తి గ్లామర్ ట్రీట్ తో అదరగొట్టింది. కానీ యానిమల్ లో వచ్చిన క్రేజ్ మాత్రం రాబట్టలేకపోయింది. ప్రస్తుతం అమ్మడు ధఢక్ 2 తో పాటు మరో సినిమా చేస్తుంది. ఈ సినిమాల మీదే తన హోప్స్ అన్నీ పెట్టుకుంది త్రిప్తి డిమ్రి. యానిమల్ టైం లో సౌత్ నుంచి ముఖ్యంగా టాలీవుడ్ నుంచి త్రిప్తికి ఆఫర్లు రావడం ఖాయమని అనుకున్నారు. ఒకటి రెండు సినిమాల్లో హీరోయిన్ గా డిస్కషన్స్ కూడా జరిగాయని టాక్. ఐతే త్రిప్తి తెలుగు ఎంట్రీ ఇవ్వకముందే మళ్లీ కెరీర్

# 'మయసభ' వార్తల్లో నిజం లేదు
## : నాగ చైతన్య టీమ్



అక్కినేని నాగ చైతన్య, విలక్షణ దర్శకుడు దేవ కట్టా కాంబినేషన్‌లో 'మయసభ' అనే పొలిటికల్ డ్రామా తెరకెక్కనుందని, అందులో చైతన్య నటించనున్నారని గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తల్లో ఎంతమాత్రం నిజం లేదని ఆయన బృందం స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ అధికారిక ప్రకటన విడుదల చేసింది.ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమని, సదరు ప్రాజెక్టుతో నాగ చైతన్యకు ఎలాంటి సంబంధం లేదని ఆయన టీమ్ తేల్చి చెప్పింది. ప్రస్తుతం నాగ చైతన్య తన పూర్తి దృష్టిని '%చీజ%24' (వర్కింగ్ టైటిల్) అనే చిత్రంపైనే కేంద్రీకరించారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అభిమానులు, మీడియా మిత్రులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. చిత్రానికి కార్తీక్ వర్మ దండు దర్శకత్వం వహిస్తున్నారు. 'విరూపాక్ష'తో మంచి విజయాన్ని అందుకున్న దండు, ఈ చిత్రాన్ని ఒక భారీ మిస్టికల్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై ప్రముఖ నిర్మాతలు బీవీఎస్‌ఎన్ ప్రసాద్, సుకుమార్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన సినిమా కాన్సెప్ట్ పోస్టర్ ఆసక్తిని రేకెత్తించింది. పురాణాల ఛాయలతో కూడిన సాహసోపేతమైన పాత్రలో చైతన్య కనిపించనున్నట్లు పోస్టర్ సూచిస్తోంది.

ఈ చిత్రానికి 'కాంతార', 'విరూపాక్ష' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. 'లాపతా లేడీస్' చిత్రంతో గుర్తింపు పొందిన యువ నటుడు స్పర్శ్ శ్రీవాస్తవ ఇందులో ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇక కథానాయికగా మీనాక్షి చౌదరి నటించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్టుతో నాగ చైతన్య సరికొత్త అవతారంలో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు.

# యంగ్ హీరోకు మెగా ఛాన్స్?



టాలీవుడ్‌లో ఇప్పుడు అందరి చూపులు మెగాస్టార్ చిరంజీవి, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కబోయే సినిమాపై ఉన్నాయి. ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు మొదలుపెడతారా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సినిమా క్యాస్టింగ్ విషయంలో తాజాగా ఓ ఆసక్తికరమైన వార్త వినిపిస్తోంది. ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవిని ఢీకొనే విలన్ పాత్రను పవర్‌ఫుల్‌గా డిజైన్ చేశాడట అనిల్ రావిపూడి. దీంతో ఈ పాత్రలో నటించేందుకు యంగ్ హీరో కార్తికేయ అయితే బాగుంటుందని చిత్ర యూనిట్ భావిస్తోందట. గతంలోనూ ఒకటి, రెండు చిత్రాల్లో విలన్‌గా తన సత్తా చాటాడు ఈ యంగ్ హీరో. దీంతో ఇప్పుడు ఈ హీరోకు మెగా ఛాన్స్ దక్కే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు చిత్ర వర్గాల టాక్. ఇక ఈ సినిమాకు భీమ్స్ సంగీతం అందిస్తుండగా షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ప్రొడ్యూస్ చేయనున్నారు.



## నాని కోసం మరోసారి
## సింగర్‌గా మారిన అనిరుధ్

%నాని హీరోగా.. శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ సినిమా 'హిట్-3'. ఈ సినిమాలో కెజిఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, ట్రైలర్, పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో మునుపెన్నడూ లేని విధంగా పూర్తి వాయిలెంట్ పోలీస్ పాత్రలో నాని కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి మరో అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమా నుంచి 'తను' అనే పాటని చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ పాటకి మిక్కీ జె మేయర్ సంగీతం అందించగా.. ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పాడటం విశేషం.గతంలో నాని నటించిన 'గ్యాంగ్ లీడర్', 'జెర్సీ' సినిమాలకు అనిరుధ్ సంగీత దర్శకుడిగా పని చేశారు. త్వరలో విడుదల కానున్న నాని మరో సినిమా 'ప్యారడైజ్'కి కూడా ఇతనే సంగీతం అందిస్తున్నాడు. అయితే ఈ పాట పాడటానికి అనిరుధ్ ఒక రూపాయి కూడా రెమ్యూనరేషన్ తీసుకోలేదని టాక్ వినిపిస్తోంది. నానితో ఉన్న బాండింగ్ వల్లే అనిరుధ్ పాట పాడటానికి డబ్బులు తీసుకోలేదట. ఇక వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై తెరకెక్కిన ఈ సినిమా మే 1వ తేదీన విడదల కానుంది.

## విజయ్ దేవరకొండ నుంచి
# అల్లు అర్జున్‌కు సర్‌ప్రైజ్ గిఫ్ట్..
### 'స్వీట్ బ్రదర్' అంటూ స్పందించిన బన్నీ




పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ కలిగిన టాలీవుడ్ స్టార్ హీరోలు అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ. ఈ ఇద్దరూ ఇప్పటికే పలు సందర్భాల్లో ఒకరిపై మరొకరు తమ అభిమానాన్ని చాటుకున్నారు. తాజాగా ఈ ఇద్దరు స్టార్లు మరోసారి వార్తల్లో నిలిచారు. విజయ్ దేవరకొండ ఇటీవల హైదరాబాద్‌లో తన బ్రాండ్ అయిన 'రౌడీ' స్టోర్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా బన్నీకి రౌడీ బ్రాండ్‌కు చెందిన ప్రత్యేకమైన డ్రెస్సులు, అలాగే ఆయన పిల్లల కోసం మినీ బర్గర్లను గిఫ్ట్‌గా పంపారు. దీనికి సంబంధించిన ఫొటోను అల్లు అర్జున్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. "మై స్వీట్ బ్రదర్.. ఎప్పుడూ నువ్వు సర్‌ప్రైజ్ చేస్తుంటావు. సో స్వీట్" అంటూ స్పందించారు.కాగా, బన్నీకి రౌడీబాయ్ గిఫ్ట్ పంపించడం ఇది మొదటిసారి కాదు. గతంలో 'పుష్ప 2' విడుదల సందర్భంగా కూడా 'పుష్ప' పేరుతో ప్రత్యేకమైన టీషర్టులను ఐకాన్‌స్టార్‌కు గిఫ్ట్‌గా పంపిన విషయం తెలిసిందే. వాటిని స్వీకరించిన బన్నీ అప్పట్లో కూడా సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ... "నా స్వీట్ బ్రదర్.. నీ ప్రేమకు కృతజ్ఞతలు" అని పోస్ట్ చేశారు. దీనికి విజయ్ కూడా "లవ్ యూ అన్నా.. మన సంప్రదాయాలు కొనసాగుతాయి" అని ప్రేమపూర్వకంగా స్పందించారు.

ఇక, ఈ ఇద్దరు స్టార్లు తమతమ భారీ ప్రాజెక్టులతో ప్రస్తుతం బిజీగా ఉన్న విషయం తెలిసిందే.